విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 183 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 24 నవంబర్ 2025 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## డైవర్షన్ పబ్లిసిటీ స్టంటే..
# "రైతన్నా.. మీకోసం"

- బాబూ..ఈ18 నెలల పాలనలో రైతుల కోసం ఎప్పుడు నిలబడ్డారు?
- వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆగ్రహం
- ఎక్స్ వేదికగా చంద్రబాబు తీరును ఎండగట్టిన వైయస్ జగన్



తాడేపల్లి: రైతుల కష్టాలు, బాధలు కనిపించనీయకుండా, దీనిమీద చర్చజరగకుండా వాటికి ముసుగు వేసి చంద్రబాబు చేస్తున్న డైవర్షన్ పబ్లిసిటీ స్టంటే.. "రైతన్నా.. మీకోసం" అంటూ వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఈ 18 నెలల కాలంలో రైతులకోసం ఎప్పుడు నిలబడ్డారు?ఎక్కడ నిలబ డ్డారని ఆయన సూటిగా ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతూ వైయస్ జగన్ తన ఎక్స్ ఖాతాలో

వివరాలు 2లో..





# సత్యసాయి సేవలు గొప్పవి

- డబ్బు, పదవి ఉన్నా లభించని ప్రశాంతత పుట్టపర్తిలో దొరుకుతుందని ప్రముఖులు ఇక్కడికి వస్తారు: సీఎం చంద్రబాబు
- ప్రేమ ద్వారా ఏదైనా సాధించవచ్చని సత్యసాయిబాబా నిరూపించారు: సీఎం రేవంత్



- ప్రశాంతి నిలయానికి 75 ఏళ్లు పూర్తి
- పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు
- పాల్గొన్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- బాబా స్ఫూర్తితో సత్యసాయి ట్రస్ట్ సేవలు అమోఘం అన్న సీఎం
- కోట్లాది రూపాయలతో తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం
- తెలంగాణలోనూ అధికారికంగా సత్యసాయి వేడుకలు జరుపుతామని ప్రకటన

పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం ఆధ్యాత్మిక సంబరాలకు వేదికైంది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలతో పాటు, ఈ ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పాటై 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదివారం జరిగిన ఈ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత వారు సత్యసాయి మహా సమాధిని దర్శించుకుని నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ సత్యసాయి బోధనలు, ఆయన స్ఫూర్తితో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు.సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే పంచ సూత్రాలతో పాటు 'లవ్ ఆల్, సర్వ్ ఆల్.. హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్' అనే సిద్ధాంతంతో సత్యసాయి బాబా కోట్లాది మంది జీవితాలను ప్రభావితం చేశారని చంద్రబాబు అన్నారు. 86 ఏళ్ల తన జీవన ప్రయాణంలో విశ్వశాంతిని, సకల జనుల సంక్షేమాన్ని ఆకాంక్షించారని గుర్తుచేశారు. డబ్బు, పదవి ఉన్నా లభించని ప్రశాంతత పుట్టపర్తిలో దొరుకుతుందని, అందుకే దేశ విదేశాల నుంచి ఎందరో ప్రముఖులు ఇక్కడికి వచ్చి ఆయన మార్గాన్ని అనుసరించారని చెప్పారు. ప్రశాంతి నిలయం ఒక గొప్ప ఎనర్జీ సెంటర్ అని అభివర్ణించారు.

మానవ సేవే మాధవ సేవగా భావించి 1960లో సత్యసాయి సంస్థలను స్థాపించి సేవలకు రూపమిచ్చారని సీఎం వివరించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, తాగునీరు వంటి రంగాల్లో అద్భుతమైన సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. 102 పాఠశాలల ద్వారా 60 వేల మందికి ఉచిత విద్య, ఆసుపత్రుల ద్వారా

వివరాలు 2లో..

## సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్
# నేడు ప్రమాణం

- 53వ చీఫ్ జస్టిస్‌గా పదవిలో 15 నెలలు
- ఆదివారం పదవీ విరమణ చేసిన జస్టిస్ గవాయ్



భారత న్యాయవ్యవస్థలో ఒక నూతన అధ్యాయానికి తెరలేవనుంది. సుప్రీం కోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఆదివారం పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, ఆయన స్థానంలో జస్టిస్

వివరాలు 2లో..

## సంపద సృష్టి, పంపిణీకి ప్రధాని సమ ప్రాధాన్యం
### ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్



దేశ సంపద సృష్టి, పంపిణీ రెండింటికీ ప్రధాని నరేంద్రమోదీ సమ ప్రాధాన్యం ఇస్తున్నారని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తిలో ఆదివారం జరిగిన బాబా

వివరాలు 2లో..


# పైరసీకి నో బ్రేక్..

### ఒక్క రోజులోనే మూవీరూల్జ్ లో కొత్త మూవీలు

- శుక్రవారం రిలీజైన సినిమాలన్నీ మూవీ రూల్జ్‌లో ప్రత్యక్షం
- థియేటర్ లో రికార్డు చేసి పైరసీ సైట్ లో అప్ లోడ్
- ప్రేమంటే, రాజు వెడ్స్ రాంబాయి సహా ఇతర సినిమాలు కూడా..

వివరాలు 2లో..



## నేడు బంగాళాఖాతంలో
# వాయుగుండం

దక్షిణ అండమాన్ సముద్రంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న దక్షిణ అండమాన్ సముద్రంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తర్వాత 48 గంటల్లో తుపానుగా బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మంగళవారం నాటికి నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక ప్రాంతాల్లో

వివరాలు 2లో..

## ప్రపంచ అభివృద్ధికి ఆరు సూత్రాలు..
### ప్రతిపాదించిన ప్రధాని మోదీ



దక్షిణాఫ్రికాలోని జెహాన్నెస్ బర్గ్ లో జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పలు కీలక సంస్కరణలకు ప్రతిపాదనలు చేశారు. AI దుర్వినియోగం నియంత్రణ, భద్రతా మండలిలో సంస్కరణలు, గ్లోబల్ హెల్త్ కేర్ రెస్పాన్స్, వంటి కీలక ప్రతిపాదనలు చేశారు మోదీ.

దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా అధ్యక్షతన జరిగిన జీ20 నేతల శిఖరాగ్ర సమావేశానికి ప్రపంచ నేతలు హాజరయ్యారు. ఒకరోజు ముందుగానే జోహెన్నెస్ బర్గ్ చేరుకున్న ప్రధాని మోదీ ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని చర్చలు జరిపారు. సమావేశాల సందర్భంగా ప్రధాని మోదీ జీ20 దేశాల నేతృత్వంలో కొత్త చొరవకు భారత్ తరపున ఆరు ప్రధాన ప్రతిపాదనలు సమర్పించారు. డ్రగ్స్, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు డ్రగ్స్ అక్రమ రవాణాపై తక్షణ చర్యలు చేపట్టాలని మొదటి ప్రతిపాదన చేశారు.

వివరాలు 2లో..

# సత్యసాయి సేవలు గొప్పవి

మొదటి పేజీ తరువాయి

రోజుకు 3 వేల మందికి ఉచిత వైద్యం అందుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో రూ.550 కోట్లతో 1600 గ్రామాలకు తాగునీరు అందించారని, ఒక్క చెన్నై నగరానికే రూ.250 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. నేడు 140 దేశాల్లో 2 వేల కేంద్రాలతో, 7.50 లక్షల మంది సేవా సభ్యులతో సత్యసాయి సంస్థలు విస్తరించడం గర్వకారణమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇదే విధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా అధికారికంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నందుకు ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. సత్యసాయి బోధనలతో వసుధైక కుటుంబ భావనను నిలబెట్టుకుందామని పిలుపునిచ్చారు.

**ప్రభుత్వాలతో పోటీపడి సేవ చేశారు సీఎం రేవంత్ రెడ్డి**

పుట్టపర్తిలో ఆదివారం జరిగిన శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాబా శత జయంతి వేడుకల్లో పాలుపంచుకోవడం తనకు లభించిన అరుదైన గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. సత్యసాయి జన్మించి నడయాడిన ఈ నేల ఎంతో పవిత్రమైనదని, ప్రపంచ నలుమూలల నుంచి ప్రముఖులు ఈ వేడుకలకు హాజరుకావడమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ప్రజలలోనే భగవంతుడిని చూసి, ప్రేమతో వారిని గెలుచుకున్న గొప్ప వ్యక్తి సత్యసాయి అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఆయన చేసిన నిస్వార్థ సేవలే ఆయన్ను దైవంగా పూజించేలా చేశాయని అన్నారు. బాబా భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన స్ఫూర్తి కోట్లాది మందిలో నేటికీ సజీవంగా ఉందని చెప్పారు. “ప్రేమతో ఏదైనా సాధించవచ్చని బాబా నిరూపించారు. ఆయన ఆత్మ మనందరిలోనూ ఉంది. మీ అందరిలోనూ ఆ స్ఫూర్తి కనిపిస్తోంది” అని ఆయన సభికులను ఉద్దేశించి అన్నారు. సత్యసాయి ట్రస్ట్ సేవలు కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాకుండా తమిళనాడు, కర్ణాటకతో పాటు ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల్లో విస్తరించడం అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. విద్య, వైద్యం, తాగునీరు వంటి కీలక రంగాల్లో ట్రస్ట్ అందిస్తున్న సేవలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రత్యేకించి, ఉమ్మడి పాలమూరు (మహబూబ్‌నగర్) జిల్లాలో తీవ్రమైన తాగునీటి సమస్యను పరిష్కరించి ప్రజల దాహార్తిని తీర్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.సత్యసాయి ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను

మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణలో ట్రస్ట్ సేవా కార్యక్రమాల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామని ఈ వేదికగా ఆయన కీలక ప్రకటన చేశారు.

# పైరసీకి నో బ్రేక్..

హైదరాబాద్: పైరసీ మాఫియా టాలీవుడ్ కు పెద్ద తలనొప్పిగా మారింది. కోట్లాది రూపాయల బడ్జెట్తో నిర్మించిన సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చిన వెంటనే పైరసీ సైట్ల దెబ్బకు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నాయి. ఇప్పటికే ఐ బొమ్మ, బప్పం టీవీ సైట్లు బ్లాక్ చేసినా, మూవీ పైరసీ దందా మాత్రం ఆగడం లేదు. తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు మూవీ పైరసీ వైబ్ సైట్లపై ఉక్కు పాదం మోపుతున్నప్పటికీ పైరసీకి బ్రేక్ పడటం లేదు. మూడు పువ్వులు ఆరుకాయలు అన్నట్లుగా మూవీ రూల్జ్ మాత్రం యథేచ్ఛగా దందాను కొనసాగిస్తోంది.

తన కార్యకలాపా లను ఎప్పటికప్పుడు దారులు మార్చుకుంటూ, సాంకేతిక మార్పులు చేసుకుంటూ సినీ పరిశ్ర మకు సవాలు విసురుతోంది. ముఖ్యంగా ఈశు క్రవారం విడుదలైన సినిమాలు ఒక్కరోజు కూడా గడవక ముందే మూవీ రూల్జ్ లో ప్రత్యక్షమయ్యా యి. అల్లరి నరేశ్ నటించిన 12ఏ రైల్వే కాలనీ, సంతాన ప్రాప్తిరస్తు, రాజు వెడ్స్ రాంబాయి. ప్రేమంటే సినిమాలను థియేటర్ లో క్యాం కార్టర్ ద్వారా రికార్డ్ చేసిన ప్రింట్లను అప్లోడ్ చేశారు. థియేటరు వెళ్లి టికెట్లు కొనుగోలుచేయలేని లేదా చేయకూడదనుకునే ప్రేక్షకులను ఈ పైరసీ ప్రింట్లు ఆకర్షిస్తున్నాయి. దీనివల్ల టాకీస్ల ఆదాయం గణనీయంగా పడిపోతోం ది. నిర్మాతలకు వచ్చే లాభాలపై, పంపిణీదారుల ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఇప్పటికే ఐ బొమ్మరవిపై పోలీసులు విచారణను వేగవంతం చేసినప్పటికీ ఈ పైరసీ మాఫియా ఒక్కొక్కరిని అరెస్టు చేసినా, కొత్త వెబ్సైట్లు, కొత్త డొమైన్ పేర్లతో మళ్ళీ మళ్ళీ పుట్టుకొస్తూనే ఉన్నాయి. దీని వెనుక బలమైన అంతర్జాతీయని నెట్ వర్క్, సాంకేతిక నిపుణుల బృందం పనిచేస్తు న్నట్లు తెలుస్తోంది. ఓవైపు ఐబొమ్మ రవి విచారణ కొనసాగుతుండగానే.. ఇంకోవైపు పైరసీ వెబ్ సైట్లలో కొత్త సినిమాలు వైబ్సైట్లో అప్లోడ్ కావడం సైబర్ క్రైమ్ పోలీసులకు సవాల్ గా మారింది. ఐబొమ్మవన్, మూవీ రూల్జ్ లు ఎలా కట్టడి చేయాలన్నది ఇప్పుడు పోలీసులకు కొత్త సవాల్ గా ఎదురైంది అటు పైరసీదందాతో తీవ్రంగా నష్టపోతున్నామంటూ సినిమా నిర్మా తలు వాపోతున్నారు.

# సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ నేడు ప్రమాణం

మొదటి పేజీ తరువాయి

సూర్యకాంత్ బాధ్యతలు చేపట్టను న్నారు. ఈ నియామకానికి సంబంధించిన ప్రక్రియ అక్టోబర్ 30న పూర్తయింది. ఆయన ఈ పదవిలో 2027 ఫిబ్రవరి 9 వరకు, అంటే సుమారు 15 నెలల పాటు కొనసాగుతారు. తన కెరీర్‌లో అనేక చరిత్రాత్మక, సంచలనాత్మక తీర్పులలో భాగస్వామి అయిన జస్టిస్ సూర్యకాంత్ నియామకంపై న్యాయవర్గాల్లో ఆసక్తి నెలకొంది.

**సాధారణ కుటుంబం నుంచి అత్యున్నత స్థాయికి..!**

జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హర్యానాలోని హిసార్ జిల్లాకు చెందిన ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. తన న్యాయవాద వృత్తిని హిసార్ జిల్లా కోర్టులోనే ప్రారంభించి, ఆ తర్వాత పంజాబ్, హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అక్కడి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. రాజ్యాంగపరమైన అంశాలు, పౌర స్వేచ్ఛ, ఎన్నికల సంస్కరణలు, లింగ సమానత్వం వంటి అనేక కీలక కేసుల విచారణలో ఆయన తనదైన ముద్ర వేశారు.

**జస్టిస్ సూర్యకాంత్ కీలక తీర్పులు**

జస్టిస్ సూర్యకాంత్ తన కెరీర్‌లో దేశ గమనాన్ని ప్రభావితం చేసిన పలు రాజ్యాంగ ధర్మాసనాల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన భాగస్వామి అయిన కొన్ని ముఖ్యమైన తీర్పులు ఇక్కడ ఉన్నాయి:ఆర్టికల్ 370 రద్దు: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన చరిత్రాత్మక ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ సభ్యుడిగా ఉన్నారు. ఇది ఆధునిక భారత న్యాయ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన తీర్పులలో ఒకటిగా నిలిచిపోయింది.దేశద్రోహం చట్టం (సెక్షన్ 124%ూ%): వలసపాలకుల కాలం నాటి దేశద్రోహం చట్టం వినియోగాన్ని నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల బెంచ్‌లో ఆయన కూడా ఉన్నారు. ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించే వరకు కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయవద్దని ఆ తీర్పు ఆదేశించింది. ఇది భావప్రకటనా స్వేచ్ఛకు దక్కిన గొప్ప విజయంగా పరిగణించబడింది.పెగాసస్ స్పైవేర్ కేసు: పెగాసస్ స్పైవేర్ ద్వారా నిఘా ఆరోపణలపై విచారణ జరిపిన ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ పాలుపంచుకున్నారు. ఈ కేసులో సైబర్ నిపుణులతో ఒక కమిటీని నియమించిన కోర్టు.. “జాతీయ భద్రత పేరు చెప్పి ప్రభుత్వానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వలేం” అని స్పష్టం చేసింది.ఎన్నికల పారదర్శకత: బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా 65 లక్షల మంది ఓటర్లను తొలగించిన వివరాలను బయటపెట్టాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన బెంచ్‌లో ఆయన ఉన్నారు. ఇది ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేసింది.లింగ సమానత్వం: అన్యాయంగా పదవి నుంచి తొలగించబడిన ఒక మహిళా సర్పంచ్‌ను తిరిగి నియమించాలని తీర్పునివ్వడంతో పాటు, సుప్రీంకోర్టు సహా దేశంలోని అన్ని బార్ అసోసియేషన్లలో మహిళలకు మూడింట ఒక వంతు సీట్లు రిజర్వ్ చేయాలని ఆదేశించారు.పీఎం భద్రతా లోపం: 2022లో పంజాబ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా జరిగిన భద్రతా లోపంపై విచారణకు జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వంలో కమిటీని నియమించిన ధర్మాసనంలో ఆయన భాగస్వామి.వన్ ర్యాంక్-వన్ పెన్షన్ (ఓఆర్‌ఓపీ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఓఆర్‌ఓపీ పథకం రాజ్యాంగబద్ధమేనని ధ్రువీకరించిన బెంచ్‌లో ఆయన కూడా ఉన్నారు.

ఈ నేపథ్యంలో, ఆయన పదవీకాలంలో భారత న్యాయవ్యవస్థలో మరిన్ని కీలక సంస్కరణలు, చరిత్రాత్మక తీర్పులు వెలువడతాయని నిపుణులు ఆశిస్తున్నారు.

# డైవర్షన్ పబ్లిసిటీ స్టంటే.. “రైతన్నా.. మీకోసం”

మొదటి పేజీ తరువాయి

పోస్టు చేశారు.చంద్రబాబు గారూ.. రికార్డు స్థాయిలో పంటల ధరలు దారుణంగా పతనమైనా మీరు రైతులవైపు కన్నెత్తిచూడ్డంలేదు. మీ కారణంగా నెలకొన్న దారుణమైన పరిస్థితులను తట్టుకోలేక, ప్రభుత్వం నుంచి ఏమాత్రం ఆసరాలేక రైతులు తాము వేసిన పంటలను తామే ట్రాక్టర్లతో దున్నివేసే పరిస్థితులు తీసుకు వచ్చారు. చంద్రబాబుగారూ.. ఇలా మీ దుర్మార్గ పాలనతో రైతుల ఒంటిమీద ఉన్న చొక్కానుకూడా తీసివేసి వారిని రోడ్డుమీద నిలబెట్టి, ఇప్పుడు మళ్లీ వారి కాలర్ ఎగరేసుకునేలా చేస్తామంటూ ప్రగల్భాలు పలుకుతూ వారికి ఎండమావులు చూపిస్తారా? రైతుల కష్టాలు, బాధలు కనిపించనీయకుం డా, దీనిమీద చర్చజరగకుండా వాటికి ముసుగు వేసి మీరు చేస్తున్న డైవర్షన్ పబ్లిసిటీ స్టంటే.. “రైతన్నా.. మీకోసం”. అసలు ఈ 18 నెలల కాలంలో రైతులకోసం మీరు ఎప్పుడు నిలబడ్డారు?ఎక్కడ నిలబడ్డారు? ఈ సంక్షోభానికి రైతులే కారణమన్నట్టుగా వారి మెడళ్లపై దాడిచేయడానికే మీరు ఎంచుకున్న ఎత్తుగడ కాదా ఇది.

మూడు విమానాలు, ఆరు హెలికాప్టర్లు, విదేశీ పర్యటనలు, వీకెండ్ హైదరాబాద్ యాత్రలతో మీ దుబారాలకు, రాజకీయ కక్షలతో తప్పుడు కేసులు నడపడానికి మీరు ఎంచుకున్న మీ లాయర్లకు, మీ పబ్లిసిటీ పిచ్చికి, మీకు డప్పుకొట్టే మీ ఎల్లోమీడియా మీ తొట్టి గ్యాంగ్‌కి, ఇలా వీరందరికీ కోట్లాదిరూపాయలు తగలేస్తున్నారు కాని, రైతులను ఆదుకోవడానికి మాత్రం మీకు మనసు రాదా?

వ్యవసాయరంగాన్ని ఉద్ధరిస్తున్నామన్నట్టుగా 10వేలమందితో టెలికాన్ఫరెన్స్ పెట్టామని గొప్పగా మీ మీడియాలో రాయించుకుంటున్నారు.

కాని, అదే నోటితో 10 మంది కలెక్టర్లకు ఫోన్ చేసి వారికి నిధులు కేటాయించి రైతులకు మంచి రేట్లు వచ్చేలా చేయమని ఎందుకు చెప్పలేకపోయారు?

ధరలు పతనమై, దీన స్థితిలో ఉన్న రైతన్నను ఆదుకుంటూ ధరల స్థిరీకరణకు వెంటనే డబ్బులు మంజూరుచేసి, రైతుల్ని ఆదుకునే చర్యలను ఎందుకు చేపట్టడంలేదు?

ఇప్పుడు కూడా ధాన్యం, మొక్కజొన్న, అరటి, కొబ్బరి, పత్తి ధరలు దారుణంగా పడిపోయినా, మీరు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ధాన్యం, కందులు, మినుములు, పెసలు, సజ్జలు, మిర్చి, పొగాకు, ఉల్లి, టమోటా, కోకో, చీనీ, మామిడి ధరలు పడిపోయినా మీకు పట్టనట్టే వ్యవహరించారు.

ఈ 18 నెలల కాలంలో దాదాపు 16 సార్లు ప్రకృతి విపత్తుల వల్ల రైతులు నష్టపోతే కనీసం ఒక్కసారైనా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నారా? రైతులకు ఏ కష్టం వచ్చినా, ఒక ముఖ్యమంత్రిగా మీరు స్పందించి ఆదుకున్న సందర్భం ఏమీ లేదు.

రైతులు, వారి తరఫున మేం పోరాటాలు చేస్తే, దాన్ని డైవర్ట్ చేయడానికి ఎదురుదాడి చేస్తారు. రైతుల పరామర్శకు వెళ్తే అన్యాయంగా కేసులు పెడతారు. రైతులను ఆదుకోవడానికి హడావిడి ప్రకటనలు చేస్తారు. తీరా ఆచరణలో చూస్తే, ఏమీ చేయరు, ఏమీ ఉండదు. మిర్చి, పొగాకు, మామిడి, ఉల్లి పంటల విషయంలో మీరు చేసింది ఇదే.

మీ దుర్మార్గ పాలనతో, మా ప్రభుత్వ హయాంలో రైతులకు కల్పించిన భద్రత, భరోసా, గ్యారంటీలను పూర్తిగా తొలగించడమో

నిర్వీర్యం చేయడమో చేశారు.

ఉచిత పంటల బీమాను రద్దుచేశారు, తుపాను సహా ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన, బీమా పరిధిలో లేని లక్షల మంది రైతులకు ఏంచేస్తారో చెప్పడంలేదు. పోనీ వారికి ఇన్సూరెన్స్ లేకపోయినా మీరే పంట నష్టరిహారం ఎప్పుడు చెల్లిస్తారో మాటమాత్రమైనా చెప్పలేకపోతున్నారు.

రైతులకు ఇవ్వాల్సిన రూ.600 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు ఎప్పుడిస్తారు? పోనీ నిన్నటి తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడంలేదు.

ఎన్నికల్లో రైతులకు అరచేతిలో వైకుంఠం చూపించారు. పీఎం కిసాన్‌కాకుండా ఏడాదికి రూ.20వేలు అన్నదాతా సుఖీభవ కింద ఇస్తామన్నారు. ఈ 2 ఏళ్లకు రూ.40వేలకు గాను ఇచ్చింది కేవలం రూ.10వేలు.

ఆర్బీకేలు, ఇ-క్రాప్, CMAPP, పొలంవద్దే పంట కొనుగోలు ఇలా అన్నీ నిర్వీర్యం. చివరకు ఎరువులకోసం కూడా రైతులు బ్లాక్‌లో కొనుగోలు చేసుకునే దుస్థితికి తీసుకువచ్చారు. రైతుల బ్రతుకులు దళారీల పాలు చేశారు.

ఇలాంటి పరిస్థితుల్లో మీ మోసాలను, మీ వంచనను ప్రశ్నిస్తూ, మీ నిర్లక్ష్యాన్ని కడిగేస్తూ మీ కాలర్, మీ పార్టీ వాళ్ల కాలర్ పట్టుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్న విషయాన్ని మరిచిపోవద్దు చంద్రబాబుగారూ.

# నేడు బంగాళాఖాతంలో వాయుగుండం

మొదటి పేజీ తరువాయి

మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

# సంపద సృష్టి, పంపిణీకి ప్రధాని సమ ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

శతజయంతి వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన ఉపరాష్ట్రపతి గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలో ఉన్న నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్, నార్కొటిక్స్)ను సందర్శించారు. శిక్షణ పొందుతున్న ఐఆర్ఎస్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో పరోక్ష పన్ను (జీఎస్టీ) వ్యవస్థను క్రమబద్ధీకరించడం ఒక మైలురాయిగా అభివర్ణించారు. ఉప రాష్ట్రపతి వెంట రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఉన్నారు. నాసిన్ డైరెక్టర్ జనరల్ డా.సుబ్రహ్మణ్యం, అదనపు డైరెక్టర్ జనరళ్లు ఉమాశంకర్, హారతి సక్సేనా, స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ అభివృద్ధికి ఆరు సూత్రాలు..

మొదటి పేజీ తరువాయి

జీ20 సభ్య దేశాలనుంచి గ్లోబల్ హెల్త్ కేర్ రెస్పాన్ టీం ను ఏర్పాటు చేయాలని కోరారు. ఆఫ్రికా అభివృద్ధికి శ్రామిక శక్తి నిర్మించేందుకు జీ20 ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ ఇన్నోవేటివ్ ను మోదీ సూచించారు.

గ్లోబల్ ట్రేడిషనల్ నాలెడ్జ్ రిపోసిటరీ స్థాపనకు ప్రధాని మోదీ ప్రతిపాదించారు.

జీ20 ఓపెన్ శాటిలైట్ డేటా భాగస్వామ్యం

ఖనిజ రంగం అభివృద్ధికి జీ20 క్రిటికల్ మినరల్స్ సర్క్యులారిటీ ఇనిషియేటివ్ వంటి ఆరు ప్రతిపాదనలను ప్రధాని మోదీ %+%20 సమావేశంలో సూచించారు.

# ఏక్యూ ఖాన్ అణు నెట్‌వర్క్‌ను కూల్చిన ‘మ్యాడ్ డాగ్’… సంచలన విషయాలు చెప్పిన అమెరికా మాజీ స్పై

పాకిస్థాన్ అణు శాస్త్రవేత్త ఏక్యూ ఖాన్ నడిపిన ప్రపంచ అణు అక్రమ రవాణా సామ్రాజ్యాన్ని కూల్చివేయడంలో కీలకపాత్ర పోషించిన అమెరికా గూఢచార సంస్థ (సీఐఏ) మాజీ అధికారి జేమ్స్ లాలర్, తన కెరీర్‌కు సంబంధించిన ఎన్నో సంచలన విషయాలను బయటపెట్టారు. ఖాన్‌కు ‘మర్చంట్ ఆఫ్ డెత్’ (మృత్యు వ్యాపారి) అని ఎందుకు పేరు పెట్టాల్సి వచ్చిందో, తనకు ‘మ్యాడ్ డాగ్’ అనే ముద్దుపేరు ఎలా వచ్చిందో ఆయన ఒక ఇంటర్వ్యూలో వివరించారు. ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ, ఏక్యూ ఖాన్ నెట్‌వర్క్‌ను బహిర్గతం చేసి, దానిని దెబ్బతీయడంలో తన పాత్రను ఆయన పూసగుచ్చినట్లు తెలిపారు.సీఐఏ కౌంటర్-ప్రొలిఫరేషన్ (అణువ్యాప్తి నిరోధక) విభాగానికి అధిపతిగా పనిచేసిన లాలర్, తొలినాళ్లలో ఏక్యూ ఖాన్ కార్యకలాపాలను అంచనా వేయడంలో తాము నెమ్మదిగా స్పందించామని అంగీకరించారు. “ఖాన్ కేవలం పాకిస్థాన్ కోసమే అణు సామగ్రిని సమకూర్చుకుంటున్నాడని భావించాం. కానీ అతను అంతర్జాతీయంగా అక్రమ వ్యాపారిగా మారతాడని ఊహించలేదు. అందుకే అతనికి ‘మర్చంట్ ఆఫ్ డెత్’ అని పేరు పెట్టాను” అని లాలర్ గుర్తుచేసుకున్నారు. ఖాన్ నెట్‌వర్క్ అనేక దేశాల అక్రమ అణు కార్యక్రమాలకు సాయం చేస్తోందని తమ పరిశోధనలో తేలిందని ఆయన తెలిపారు. ఇందులో పాకిస్థాన్ ప్రమేయం గురించి ప్రశ్నించగా, “ఏక్యూ ఖాన్ కొందరు పాకిస్థానీ జనరళ్లు, నేతలకు జీతాలిచ్చేవారు. అయితే ఇది కొందరు వ్యక్తులకు సంబంధించింది మాత్రమే, పాకిస్థాన్ అధికారిక విధానం కాదు” అని స్పష్టం చేశారు.అక్రమ అణు వ్యాపారులను ఎదుర్కోవడానికి తాము అనుసరించిన వినూత్న వ్యూహాన్ని లాలర్ వివరించారు. “అణు వ్యాపారాన్ని, వ్యాపారులను ఓడించాలంటే, నేనే ఒక వ్యాపారిగా మారాలని నిర్ణయించుకున్నాను” అని తెలిపారు. ఈ వ్యూహంలో భాగంగా, తామే కొన్ని రహస్య కంపెనీలను సృష్టించి, అణు టెక్నాలజీ సరఫరా చేస్తున్నట్లు నమ్మించామన్నారు. అక్రమ అణు కార్యక్రమాలు నడుపుతున్న దేశాలకు ఉద్దేశపూర్వకంగా లోపభూయిష్టమైన, పనిచేయని పరికరాలను సరఫరా చేసి వారి ప్రయత్నాలను దెబ్బతీశామని చెప్పారు.

సెప్టెంబర్ 11 దాడుల తర్వాత, లిబియా అణు కార్యక్రమంపై ఆందోళనలు పెరిగాయని లాలర్ తెలిపారు. ఆ సమయంలో ‘బీబీసీ చైనా’ అనే ఓడను అడ్డగించి, అందులో ఉన్న లక్షలాది అణు సంబంధిత పరికరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ సాక్ష్యాలను లిబియా అధికారుల ముందు ఉంచినప్పుడు, గదిలో సూది కిందపడినా శబ్దం వినిపించేంత నిశ్శబ్దం అలుముకుందని ఆయన ఆనాటి ఘటనను గుర్తుచేసుకున్నారు. ఆ తర్వాత గడాఫీ తన అణు కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేసుకున్నారని, అది తన కెరీర్‌లో అత్యంత సంతృప్తినిచ్చిన క్షణమని పేర్కొన్నారు.ఏక్యూ ఖాన్ నెట్‌వర్క్ ఇరాన్‌కు కూడా అణు సాంకేతికతను అందించింది. సెంట్రిఫ్యూజ్ నమూనాలు, బాలిస్టిక్ క్షిపణి టెక్నాలజీ, చైనాకు చెందిన అణుబాంబు బ్లూప్రింట్‌ను కూడా ఖాన్ ఇరాన్‌కు చేరవేశాడని లాలర్ ఆరోపించారు. ఒకవేళ ఇరాన్‌కు అణ్వస్త్రం లభిస్తే, అది మధ్యప్రాచ్యంలో ‘న్యూక్లియర్ మహమ్మారి’ ఆవిర్భావానికి దారితీస్తుందని, ఇతర దేశాలు కూడా అణ్వాయుధాల కోసం పోటీపడతాయని హెచ్చరించారు.ఇక తనకు ‘మ్యాడ్ డాగ్’ అనే పేరు రావడం వెనుక ఉన్న కథను కూడా ఆయన పంచుకున్నారు. ఫ్రాన్స్‌లో పనిచేస్తున్నప్పుడు, ఉదయం జాగింగ్ చేస్తుండగా ఒక జర్మన్ షెపర్డ్ తనపై దాడి చేసిందని, దానితో పోరాడి బయటపడ్డానని తెలిపారు. దానికి రేబిస్ ఉండొచ్చని వైద్యులు చెప్పడంతో, తనకు రేబిస్ వస్తే ఎవరెవరిని కరవాలో ఒక జాబితా రాసుకున్నానని సరదాగా చెప్పారు. ఆ ఘటన తర్వాత తన సహచరులు తనను ‘మ్యాడ్ డాగ్’ అని పిలవడం మొదలుపెట్టారని అన్నారు.భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని లాలర్ అభిప్రాయపడ్డారు. దక్షిణాసియాలో అణు యుద్ధం జరిగితే విజేతలుండరని, ప్రపంచవ్యాప్తంగా వినాశనం తప్పదని ఆయన హెచ్చరించారు. అణ్వాయుధాల పూర్తి నిర్మూలన సాధ్యం కాకపోయినా, వాటి వ్యాప్తిని నిరోధించడం ద్వారా ప్రమాదాన్ని తగ్గించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

# బ్రాహ్మణ పితృకర్మల భవనము ప్రారంభోత్సవంలో కొణతాల





**అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 23:** పట్టణం లోని శారద నది ఘాట్ వద్ద అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మింపబడిన పితృకర్మల భవనమునకు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ. బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కొణతాల రామకృష్ణ ని పూర్ణ కుంభంతో, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం కొణతాల పితృకర్మల భవనమును ప్రారంభోత్సవం చేసి వారు ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కార్యరూపం దాల్చడానికి దోహదపడ్డ వంటి గంటి రవికి, శ్రీకాంత్, ఇతర సోదలందరికీ అభినందనలు తెలియజేశారు. ఒక వ్యక్తిగా తలుచుకుంటే జరగనున్నటువంటిది ఏమీ ఉండదు అని, జేబులో ఒక రూపాయి లేకుండా మొదలు పెట్టి పితృకర్మల కార్యక్రమాలు చేయడానికి చక్కటి ఆలోచనతో ఎక్కడెక్కడో చేసుకోవాల్సిన అవసరం లేకుండా అన్ని ఒకచోటే చేసుకొని విధంగా, అందరి సహాయ సహకారాలతో కార్యక్రమం చేపట్టడం మీ అందరి గొప్పతనం అని కొనియాడారు. భారతదేశం మనం అంత మైపోయిన, దోపిడీ గురైపోయిన ప్రపంచంలోకెల్లా ఆఖరి స్థానంలో వెళ్లిపోయిన మళ్లీ నాలుగవ అతిపెద్ద ఆర్థిక నాలుగవ దేశంగా తిరిగి వచ్చామంటే దానికి కారణం ఒకరకంగా ఈ సంస్కృతి, ఈ సంస్కారాన్ని కాపాడుకోవడం వల్ల జరుగుతుందని అన్నారు. మన సంస్కృతం, వేదాలు ఈ భూమిలో ఉన్నవి అన్నారు. ఈరోజు వేదం ప్రతి విద్యార్థి నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వేదం లోనే సంస్కారం, సంస్కృతి ఉందని, వేదం లో ప్రతిష్టమైన విద్యా వ్యవస్థ ఉందని, అవన్నీ ఉన్నాయి కాబట్టి ఈరోజు అగ్రస్థానానికి రాగలుగుతున్నామని అన్నారు. నేనైతే భారతరత్న పీవీ నరసింహారావు తో పనిచేయడం అనేది నా అదృష్టంగా భావిస్తున్నాను అని, తనొక మహానుభావుడని, అటువంటి వ్యక్తిని నా జన్మలో ఎప్పుడో చూడలేదని, అటువంటి వ్యక్తి మళ్ళీ రారు కూడా అన్నారు. ఆయన పలు భాషల్లో అపారమైన ప్రావీణ్యంతో, ఆయన చైర్మన్ గా ఉన్న కమిటీలో నేను కన్వీనర్ గా ఉండడం నా అదృష్టమని అని అన్నారు. అలాగే భారతరత్న వాజ్ పాయ్ లాంటి వారితో పని చేసే అవకాశం నాకు రావడం ఎంతో గర్వంగా వ్యక్తం చేస్తానని అన్నారు. ఈ రోజు మన సంస్కృతిని, వేదాలు కాపాడు కోవడం కోసం అవసరం ఎంతైనా ఉందని, వేదాలు కాపాడే బాధ్యత మీ అందరిలో ఉందని, ఇలా చేయడం వల్ల ప్రపంచంలో నెంబర్ వన్ స్థానాల్లో మన దేశం ఉంటుందని, అలాగే ప్రపంచంలో అత్యంత గర్వింపబడ్డ దేశం ఏదంటే మన భరతఖండం అన్నారు. ప్రపంచంలో మేధాశక్తి అంతా మన భారత దేశంలో ఉందని అందువల్లే ప్రపంచ దేశాల్లో మన భారతీయులందరూ పనిచేస్తున్నారని అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘానికి మంచి ప్రాధాన్యం ఉన్న ప్రాంతంలో బ్రాహ్మణ కళ్యాణ మండపానికి నిమిత్తం చింతామణి ఇచ్చిన 27 సెంట్లు కేటాయించామని, అది కూడా చాలామంది ఆక్రమణ చేయడానికి ప్రయత్నించారని, ఈ కళ్యాణ మండపం నిర్మాణానికి ఒక కమిటీ వేసుకొని ఆ కమిటీ ద్వారా గవర్నమెంట్ నుంచి అప్రూవల్ తీసుకొని నిర్మాణం చేయాలని ఆలోచనతో ఒక ఆర్డర్ కూడా తీసుకోవడం జరిగిందన్నారు. ఈ మండపం నిర్మాణానికి విరాళాలు ప్రకటించిన దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. సీజఫ్ గ్రాండ్ కింద 20 లక్షలు మనం పోగు చేయగలిగితే ప్రభుత్వం నుంచి 80 లక్షల సీజఫ్ నిధులు మంజూరు చేసే కార్యక్రమంతో ఈ మండపాన్ని కోటి రూపాయలతో నిర్మాణం ప్రారంభిద్దాం అన్నారు. అంటూ ఇటువంటి మంచి కార్యక్రమాలు ఎన్నో చేయాలని నా తరపున ఎల్లప్పుడూ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. అనంతరం బ్రాహ్మణులచే వేదమంత్రాలతో కొణతాల రామకృష్ణ ని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ఘనంగా సత్య సాయి బాబా శతజయంతి వేడుకలు



**బాపట్ల, పెన్ సత్తా, నవంబర్ 23:** పిట్టలవాని పాలెం మండలం కాజీ పాలెం గ్రామం లోని అరవింద్ ఆశ్రమంలో గల సత్య సాయి ఆరోగ్యం మల్టీ స్పెషాలిటీ వైద్యశాలలో సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బాపట్ల శాసనసభ్యులు వేగేషన్ నరేంద్ర వర్మ రాజు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ లు పాల్గొని సత్య సాయి బాబా సేవా కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం సాయి ఆరోగ్యం మల్టీ స్పెషాలిటీ వైద్యశాలకు 2026 జనవరి నుంచి తన జీవితకాలం పాటు ప్రతి ఏడాది లక్ష రూపాయలు చొప్పున విరాళంగా అందించనున్నట్లు బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు ప్రకటించారు. అదే విధంగా ఈ ప్రాంత ప్రజా ప్రతినిధిగా వైద్యశాలకు సిమెంటు రోడ్డు నిర్మాణం కొరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేయించే బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ కరుణ్ రాజు, డాక్టర్ మంతెన నరసరాజు, వేగేసిన కిషోర్ కుమార్, బాపూజీ, రాజు, గోకరాజు, సుబ్బరాజు, అల్లాపురం గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు, లక్కం రాజు, వెంకటపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

# భావి భారత పౌరుల్ని తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉంది.

ఎస్టీయూ విద్యా భవన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బండారు.







**ఆలమూరు, పెన్ సత్తా, నవంబర్ 23:**
భావి భారత పౌరుల్ని తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. ఆలమూరులో నూతనంగా నిర్మించిన ఎస్టీయూ విద్యా భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సమాజానికి దిక్సూచి, సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులే అన్నారు. ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉంటే వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఆదర్శవంతులుగా తయారవుతారని, తద్వారా మంచి సమాజం నిర్మితమవుతుందన్నారు. 2019 కి ముందు ఎస్టీయూ వారు తనను కలసి భవన నిర్మాణం కోసం స్థలం ఇవ్వాలని కోరారని అప్పట్లో స్థలం మంజూరు చేసి రూ.5 లక్షల గ్రాంట్ కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వం మారడంతో ఆ గ్రాంట్ బుట్టదాఖలా అయిందన్నారు. మరలా కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ఎస్టీయూ వారు కలిశారని, స్థలాన్ని అద్భుత మైన భవనంగా మలిచిన ఎస్టీయూ వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణానికి రూ.1లక్ష విరాళం ఇచ్చిన ఆలమూరు వంటిపల్లి పాపారావును ఎమ్మెల్యే అభినందించారు. అలాగే రూ. 3 లక్షల ప్రభుత్వ గ్రాంటు మంజూరుకు కృషి చేస్తానన్నారు. బ్రాహ్మణ సంఘం నాయకులు సైతం భవన నిర్మాణానికి స్థలం మంజూరు కోరారని, ఇప్పుడే గ్రామ పెద్దలతోనూ, అధికారుల తోనూ ఆ అంశం పై మాట్లాడటం జరిగిందన్నారు. ఎస్టీయూ జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ మాదే రాజగోపాల్ పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్ఎంపీ డాక్టర్లు నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం











**తెనాలి, పెన్ సత్తా, నవంబర్ 23:** మేడి కొండూరు, గుండ్లపాలెంలలో సీసీ రోడ్లు తదితర నిర్మాణాలకు గానూ తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభోత్సవం మరియు శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని తన వాక్ చాతుర్యంతో మాట్లాడుతూ
కష్టపడే చేతులకు, మట్టితో స్నేహం చేసే రైతులకు, గుండ్లపాలెం గ్రామస్తు లకు
కూటమి ప్రభుత్వ గౌరవాన్ని గ్రామ తోరణంగా కట్టిన ప్రజలకు నా హృదయపూర్వక నమస్కారాలు అన్నారు. అభిప్రాయాలకు, రాజకీయాలకు దూరంగా ఆలోచించి మంచి నాయకులను గెలిపించుకుంటే అభివృద్ధి ఎలా జరుగుతుంది అని చెప్పడానికి ఈ గ్రామమే ఒక ఉదాహరణ అన్నారు. ఈ రోజున బిల్లులు రాకపోయినా సొంత ఖర్చుతో గ్రామాభివృద్ధికి బాధ్యత తీసుకున్నటువంటి పాములపాటి కృష్ణయ్య వంటి నాయకులు చాలా అరుదుగా ఉంటారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి, పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు మేము బాధ్యత తీసుకుంటామన్నారు. పత్తి రైతుల ఇబ్బందులను నిశితంగా పరిశీలిస్తున్నాము. రైతు సమస్యల పరిష్కారానికి కచ్చితంగా ఒక పరిష్కారాన్ని అందజేసే బాధ్యత తీసుకుంటాం. కౌలు రైతులు బాగుంటేనే వ్యవసాయం బాగుంటుంది. అన్నదాత సుఖీభవ నుంచి అందే లబ్దిని లబ్ధిదారులు కౌలు రైతులకు కూడా అందజేసేలా చొరవ తీసుకుంటే వారి జీ వన విధానానికి బాగుంటుంది. కౌలు రైతులకు న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ కూడా ఈ విషయం పై అధికారం లోకి వచ్చిన ఫస్ట్ మీటింగ్ లోనే కౌలు రైతుల గురించి చర్చించారు. కొండమోడు - పేరేచర్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించిన కొన్ని ఇబ్బందులను కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తాను. గత ఐదేళ్లు రాష్ట్రం అరాచక పాలనలో నలిగిపోతున్న క్రమంలో, ప్రజలు విముక్తి కోరుకుంటున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ను ఆర్థికంగా గట్టు ఎక్కించగలను, సంపాదన సృష్టించగలను అనే నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు భరోసా ఇచ్చారు.
అలాగే లోకేష్ కూడా విద్య వ్యవస్థను అభివృద్ధి పరిచే దిశగా చర్యలు చేపట్టారు. డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా టీచర్ ఉద్యోగాలు అందజేసిన లోకేష్, రెండో డిఎస్సి ప్రకటన కూడా కార్యాచరణ రూపొందిస్తున్నారు.
వైసిపి హయాంలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా ఆంధ్రప్రదేశ్ వైపు కన్నెత్తి చూడలేదు. కానీ ఇప్పుడు సీఎం చంద్రబాబు, లోకేష్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కు వందలాది పరిశ్రమలు వేలాది, లక్షలాది కోట్ల పెట్టుబడులతో వస్తున్నాయి. ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ప్రజలకు విన్నవిస్తున్నాను.
అనంతరం ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్నా గుండ్ల పాలెం గ్రామ అభివృద్ధికి పెద్దపేట వేస్తుందన్నారు. ఇక్కడి ప్రజలు కూడా ఎంతో ప్రత్యేకంగా పార్టీ కి కమిట్మెంట్ తో పనిచేస్తూ ఉంటారు. అలాంటి ప్రజలు వెంకట కృష్ణయ్య ని యునానిమస్ గా ఎన్నుకోవడం ఆనందించదగ్గ విషయం.
గ్రామంలో ఇంకా చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తాం అన్నారు. వైసిపి హయాంలో రౌడీయిజం, దౌర్జన్యాలు, బెదిరింపులు ప్రజలను ఎంత ఇబ్బంది పెట్టాయి. మన కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక కనీసం అలాంటి బెదిరింపులు, దౌర్జన్యాల ఊసు కూడా, ముఖ్యంగా మన నియోజకవర్గంలో ఎక్కడా వినిపించడం లేదు, అది తెలుగుదేశం పార్టీకి ఉన్న ప్రత్యేక లక్షణం.
ఒకప్పుడు పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు జీతాలు అందక బిక్షాటన చేసిన రోజులు ఉన్నాయి. కానీ ఈరోజు పవన్ కళ్యాణ్ చేతుల్లోకి వెళ్లాక ఉద్యోగులందరూ గర్వంగా పనిచేయగలు గుతున్నారు. నారా లోకేష్ విధ్యా రంగాన్ని చాలెంజిగా తీసుకొని పనిచేస్తున్నారు. నూతన ఆవిష్కరణ తీసుకొస్తూ, విద్యా వ్యవస్థ పై గౌరవాన్ని పెంచుతున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మల్లిపెద్ది రమేష్, మండల పార్టీ పెద్దలు నార్నే శ్రీనివాస్, పాములపాటి శివన్నారాయణ, గుండ్లపాలెం సర్పంచ్ పాములపాటి వెంకట కృష్ణయ్య, అబ్దుల్ ఘని, పంచాయతీరాజ్ ఏ.ఈ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు.

**అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 23:** అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి బాబా చిత్రపటానికి పుష్పమాలు సమర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, గవర కార్పొరేషన్ చైర్మన్, డిఆర్ఓ, సత్యసాయి ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు అప్పల నాయుడు, సత్యసాయి భక్తులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా బోధనలు సేవ, ప్రేమ, శాంతి, సత్యం, ధర్మం వంటి మానవ విలువలకు ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు. బాబా సేవా తత్వాన్ని అనుసరిస్తూ అనకాపల్లి జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు అమలు అవుతున్నాయని తెలిపారు. జిల్లాలో 100 బాల వికాస్ కేంద్రాలు స్థాపించటం, మహిళలకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు 300 మందికి టైలరింగ్ శిక్షణ అందించడం, ఎన్టిఆర్ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు ప్రతిరోజూ 150 మందికి భోజన వసతి కల్పించడం, ఏడాదికి రెండు లక్షల మందికి అన్నార్థుల భోజన వసతి అందించడం వంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేసేవని చెప్పారు. భగవాన్ సత్యసాయి బాబా జీవితం మానవాళికి సందేశమని, ఆయన ఆధ్యాత్మిక బోధనలు, సేవా కార్యక్రమాలు ఎల్లప్పుడూ అందరికీ ప్రేరణగా ఉంటాయని అన్నారు. తదుపరి ప్రసంగాల్లో అధికారులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు భగవాన్ సత్యసాయి బాబా ఆదర్శ జీవితం, సేవా తత్వం గురించి వివరించి, ప్రభుత్వం శత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో భజనలు, కీర్తనలు నిర్వహించగా మహా మంగళహారతితో కార్యక్రమం ముగిసింది. అనేక శాఖల అధికారులు, సాయి భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# పుస్తకాల పిచ్చి సూర్యనారాయణ కు ఎన్నో అవార్డులు తెచ్చి పెట్టింది





**గుంటూరు, పెన్ సత్తా, నవంబర్ 23:**కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ శాఖ విశ్రాంత ఉద్యోగిగా, విరామం ఎరుగని సాహిత్యాభిలాషిగా లంకా సూర్యనారాయణ జీవన దృక్పథం ఆదర్శనీయమని అఖిల బారత సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి. వివేకానంద, గద్దె తిలక్ పేర్కొన్నారు. లంకా సూర్యనారాయణ తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీ నుండి జీవన సాఫల్య పురస్కారం అందుకున్న సందర్భంగా గుంటూరు కన్నవారితోట లోని జి.ఎస్.టి భవన్ లో సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో లంకా సూర్యనారాయణను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు వివేకానంద, గద్దె తిలక్ మాట్లాడుతూ లంకా సూర్యనారాయణ చిన్ననాటి నుండే పుస్తకాలు కొని చదవటమే కాకుండా, వాటిని భద్రపరచి, అసాధారణ రీతిలో ఎన్నెన్నో పుస్తకాలు సేకరించి అవి అందరికి అందేలా అన్నమయ్య పేరుతో గ్రంధాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. రాష్టంలో ప్రతిష్టాత్మక మైన వెంకటేశ్వర యూనివర్సిటీ ఇచ్చిన పురస్కారం లంకా అపారశ్రమకు దక్కిన గౌరవమన్నారు. పుస్తక రంగంలో సూర్యనారాయణ చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకం అన్నారు. ఆయన విజయాలు పెన్షనర్లందరకి గర్వకారణమన్నారు.

జిఎస్టి రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ జి. జయప్రకాష్ మాట్లాడుతూ...ఉద్యోగి గా శాఖ పరిపుష్టి కి, సాహిత్యాభిలాషిగా కళల పురోభివృద్ధికి సూర్యనారాయణ చేసిన సేవలు సాటిలేనివన్నారు. ఉద్యోగం ద్వారా వచ్చిన తన జీతం మొత్తాన్ని పుస్తకాలకే ఖర్చు చేయడం, తొంబై వయసులో నేటికీ పుస్తక సేకరణ కొనసాగించడం సూర్యనారాయణ నిబద్ధతకు నిదర్శనమన్నారు. లంకా చూపిన మార్గం భవిష్యత్ తరాలకు వరమన్నారు. కస్టమ్స్ విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ కె రాజారావు మాట్లాడుతూ అన్నమయ్య గ్రంధాలయ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసి, గుంటూరు కు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన గొప్ప వ్యక్తి సూర్యనారాయణ అని ప్రశంసించారు. అపూర్వమైన దూరదృష్టి, అపారమైన సృజనాత్మకత, అద్భుతమైన క్రమశిక్షణ, అసమానమైన ప్రతిభ సూర్యనారాయణ ఆభరణాలన్నారు. లంకా జీవితం నిత్య స్ఫూర్తి, మార్గదర్శనమన్నారు. సన్మాన గ్రహీత లంకా సూర్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో తనకు మంచి గౌరవం, గుర్తింపును సెంట్రల్ ఎక్సైజ్ శాఖ ఇచ్చిందన్నారు. ఉద్యోగి గా ఎన్నో మైలురాళ్లు అధికమించి, పుస్తక సేకరణ కర్తగా ఎన్నో గౌరవాలు దక్కించుకున్నానన్నారు. హాబీగా చేపట్టిన పుస్తక సేకరణకు ప్రభుత్వ అవార్డులు, పురస్కారాలు లభిస్తాయని ఊహించ లేదన్నారు. పుస్తక సేకరణలో ఎదురైనా ఇబ్బందులు, అనుభవాలను ఆయన వివరించారు. అనంతరం లంకా సూర్యనారాయణను విశ్రాంత ఉద్యోగులు పెద్ద ఎత్తున సన్మానించారు. కార్యక్రమంలో పి.వి. సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి. కోటేశ్వర రావు, ఎన్.ఎస్. నగేష్ బాబు, కేశవన్, టి.ఎన్. వరప్రసాద్, మస్తాన్, నాగశంకర్, నందకుమార్, శాస్త్రి, ఈశ్వరమ్మ, ఆషా, భానుమతి, మేరీ, అలివేలు తదితర పెన్షనర్లు పాల్గొన్నారు.

## ప్రకృతి పంటల రైతుల నడకను జయప్రదం చేయండి.

- ఈనెల 29 వ తేదీ శనివారం ఉదయం ఆరు గంటలకు ఆర్కే బీచ్ కు తరలిరండి.
- నడకలో పాల్గొనె విద్యార్థులకు సర్టిఫికేట్ లు ఇస్తాం.
- దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, జిల్లా అధ్యక్షులు.






**విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 22:**గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి పంటల రైతుల నడకను జయప్రదం చేయండి అని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ పిలుపు నిచ్చారు. ఆదివారం ఉదయం ఆంధ్రా యూనివర్సిటీ ఎ హబ్ వద్ద ప్రకృతి పంటల సంత లో ప్రకృతి పంటల రైతుల నడక గోడ పత్రికను ఎపి కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ముకుంద, విశ్రాంత జాయింట్ చీఫ్ ఇంజనీర్ శ్రీరామమూర్తి, ఉద్యానవనాల శాఖ ఏడీ శ్యామల లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 29 వ తేదీ శనివారం ఉదయం ఆరు గంటలకు ఆర్కే బీచ్, కాళీమాత ఆలయం వద్దకు తరలి రండి అని పిలుపు నిచ్చారు. ఈ నడకలో పాల్గొనె విద్యార్థులకు సర్టిఫికేట్ లు ఇస్తాం అన్నారు. డిసెంబర్ నెలలో నిర్వహించే ఆర్గానిక్ మేళాను జయప్రదం చేయాలని కోరుతూ నిర్వహించేందుకు ఈ నడక కార్యక్రమాన్ని, సాంస్కృతిక బృందాలతో సాంప్రదాయ బద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సంకల్ప ఆర్ట్ విలేజ్ ప్రతినిధి ఆకుల చలపతి రావు, అవని ఆర్గానిక్స్ ఉషా గజపతి రాజు, పాలెం నేచురల్స్ అశోక్, ఐటీ ప్రొఫెషనల్ నరేంద్ర, విశాఖ మహానగర్ పర్యావరణ ప్రమఖ్ రంగాచార్యులు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, ప్రకృతి రైతులు పాల్గొన్నారు.

# బాక్సింగ్ కోచింగ్ సెంటర్ ని ప్రారంభించిన









**మునగపాక, పెన్ సత్తా, నవంబర్ 23:** మండలం నాగులాపల్లి గ్రామంలో రాయల్ క్లబ్ బాక్సింగ్ కోచింగ్ సెంటర్ ని మండల మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం దొడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాక్సింగ్, వ్యాయామం, కబడ్డీ, వాలీబాల్ వంటి గేమ్స్ చిన్నప్పటి నుంచి నేర్చుకోవడం ద్వారా యువత ఆరోగ్యంగా ఉండడటమే కాకుండా ఉత్సాహంగా ఉంటారన్నారు. యువత విద్యాభివృద్ధి తో పాటు, క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తే వారి జీవిత ఎదుగుదలకు ఎంతో ఉపయోగ పడతాయి. క్రీడాకారులకు లభించే సర్టిఫికెట్స్ కూడా అంతే వేల్యూ ఉంటుందన్నారు. యువత క్రీడల్లో రాణిస్తూ దేశానికి, రాష్ట్రానికి, గ్రామానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరాహ, నాగులాపల్లి ఉపసర్పంచ్ గోసాల గోవింద్, రాయల్ క్లబ్ నిర్వాహకుడు రేగాని భాస్కర్ రావు, అనకాపల్లి పార్లమెంట్ తెలుగు అధికార ప్రతినిధి మల్ల రాజేష్, సీనియర్ బాక్సింగ్ కోచ్ మైలిపెల్లి సత్యనారాయణ, ఓరుగంటి భాస్కర రావు, నేతల రాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రాష్టంలో పర్యావరణాన్ని కాపాడండి.

**సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి**



**పరవాడ, పెన్ సత్తా, నవంబర్ 23:** రాష్టంలో లక్షల కోట్ల పెట్టుబడులతో వచ్చే పరిశ్రమల్లో వేలాది మందికి ఉపాధి కలగనుందని ప్రభుత్వం చెబుతున్న మాటలను ప్రజలు విశ్వసించక పోవడమే కాదు, ఆ పరిశ్రమల ఏర్పాటు కోసం జరిగే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలన్న డిమాండ్ పై ఏకమవడం నూతన పరిణామం. ప్రభుత్వం ఇప్పటి కైనా గమనించాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఆదివారం అయన పరవాడలో విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి పేరు తో మోసగించి కార్పొరేట్లు, పెట్టుబడి దారులకు లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం పడుతున్న తాపత్రయానికి ప్రజా పోరాటాలు ప్రతిబంధకంగా మారాయి. తమ ఆధీనం లోని పోలీసు బలగాలతో ప్రజలను భయ పెట్టాలని చేసిన ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. పరిశ్రమలు పెట్టి బతుకులు పాడు చేయొద్దన్న నినాదం ప్రతిధ్వనిస్తోంది. ప్రజల ఆగ్రహం ముందు అణచివేత, నిర్బంధ చర్యలు సాగవని జన సమూహాలు పాలకులను హెచ్చరిస్తున్నాయి. పోలీసును చూసి మనుషులు భయపడకుండా ఎందుకు తిరగబడుతున్నారు?, పరిశ్రమలకు ఒకనాడు భూములిచ్చిన రైతులు ఇపుడెందుకు ససేమిరా ఇవ్వమంటున్నారు? అన్న ప్రశ్నలకు ప్రభుత్వాల వద్ద జవాబులు లేవు. కానీ భూములిచ్చి, ఉపాధిలేక బతుకు తెరువుకు వూరూవాడా తిరుగుతున్న రైతులు, పేదలు, మత్స్యకారులు, చేతివృత్తి దారులకు అనేక అనుభవాలున్నాయి, నేర్చుకున్న పాఠాలున్నాయి, మనసు నిండా గూడు కట్టుకున్న బాధలున్నాయి. జీవితాలను సరిదిద్దు కోలేమన్న నిరాశలున్నాయి. ఈ క్రమం లోనే ప్రయివేటు పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను ప్రజాభిప్రాయ సేకరణలో నిరసన రూపంలో తెలియజేస్తున్నారు. అనకాపల్లి జిల్లా లోని నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు వద్దని ఏక కంఠంతో ప్రజలు చెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెట్టి పనులు చేపడుతోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ప్రభుత్వరంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్ను దెబ్బతీసి ప్రయివేటీకరించేందుకు, స్థానికుల ఉపాధి పై ఊసెత్తని ఆర్సెలార్ మిట్టల్ ను ప్రోత్సహించే ప్రభుత్వ కుట్రలను అర్ధంచేసుకున్న ప్రజలు కాలుష్యనియంత్రణ మండలి ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయసేకరణ సదస్సులో తమ అభ్యంతరం తెలిపారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గం లోని నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమలను ప్రజలు వ్యతిరేకిస్తుంటే, పెట్టితీరాలని ప్రభుత్వం మొండిగావుంది. పోలీసులను చూపి వెనక్కుతగ్గేలా చేయాలని ప్రభుత్వం చూస్తే, తమ ఆలోచన విరమించుకొనేలా ఒత్తిడి పెంచాలని నిర్వాసితులు, బాధిత మత్స్యకారులు, ప్రజలు భావించారు. కొద్ది రోజుల క్రితం ఆ ప్రాంత పర్యటనకు వెళ్లిన మంత్రి అనిత వాహనం ముందు తాటిచెట్టు అడ్డంపెట్టి చెమటలు పట్టించేలా పోరాడారు. విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ మండలంలో గంగవరం పోర్టు ఆవరణలో అదానికి చెందిన అంబూజా సిమెంట్ గ్రైండింగ్ పరిశ్రమ ఏర్పాటుకు పెట్టిన ప్రజాప్రాయ సేకరణను వాయిదా వేసినట్లు అధికార యంత్రాంగం ప్రకటనచేసే పరిస్థితి ఏర్పడింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సొంత నియోజకవర్గం గాజువాక పరిధి లోని పెదగంట్యాడ ప్రాంతంలో ప్రజలు తిరగబడ్డారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలను సిపిఎం, వామపక్షాలు సమీకరించాయి. అదానీ కొమ్ముగాసినా ప్రభుత్వ ఆటలు ఇక్కడ సాగనివ్వబోమని ప్రజల పక్షాన అవి నిలబడ్డాయి. అదానీకి చెందిన గంగవరం పోర్టు ధూళి, దుమ్ముతో భరించలేని కాలుష్యంతో బాధపడుతున్న ప్రజల్లో అంబూజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు పై ఆగ్రహం వెల్లువెత్తింది. రాష్టంలో తీరప్రాంతం, సెజ్లో ఏర్పాటైన ఔషధ, రసాయన పరిశ్రమలతో ఆ పరిసర ప్రాంత ప్రజలకు పీల్చే గాలి, తాగేనీరు ప్రమాదకరంగా మారాయి. ప్రాణాంతక వ్యాధులకు అవి కేంద్రంగా వున్నాయి. పర్యావరణ పరి రక్షణ బాధ్యతను ఆటు ప్రభుత్వమూ, ఇటు పరిశ్రమాధిపతులు పూర్తిగా వదిలేశాయి. కోట్ల విలువైన రాయితీలు, సదుపాయాలు కల్పించి పరిశ్రమాధిపతులకు లాభాలు సమకూర్చడం పైనే ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నాయి. ఆ పరిశ్రమలకు భూములిచ్చిన రైతులు, ఉపాధి కోల్పోయిన పేదలు, వృత్తిదారులను విస్మరించాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ముందుకుతెచ్చి ప్రజలకు కనీస భద్రతను లేకుండా డబుల్ ఇంజన్ (మోదీ, చంద్రబాబు) సర్కారు చేశాయి. చట్టబద్ధ నియంత్రణలను కార్పొరేట్లు, పెట్టుబడిదారులు పాటించాల్సిన అవసరం లేకుండా చేస్తున్నాయి. గాలి, నీరు కలుషితం చేస్తున్నా పట్టించుకోవడం మానేశాయి. చివరకు కాలుష్యనియంత్రణ మండలి, ఫ్యాక్టరీల అధికారుల తనిఖీలపై ఆంక్షలు విధించి విచ్చలవిడితనానికి అవకాశం కల్పించాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రమాదకరమైన, అత్యంత ప్రమాదకరమైన జాబితాలో 386 పరిశ్రమలున్నట్లు 2023 లో అధికార యంత్రాంగం గుర్తించింది. గత ఐదేళ్లలో 110 పరిశ్రమలకు నోటీసులు జారీచేశారు. విశాఖ నగర వాసుల ఆరోగ్యాలను కాలుష్యంతో దెబ్బతీస్తున్న విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, గంగవరం పోర్టును పర్యావరణ ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవడంలేదు. ఎన్టీపిసి కాలుష్యంతో మూల స్వయంవరం, సోమినాయుడుపాలెం ప్రజలు తీవ్ర అనారోగ్యాలతో పడుతున్నారు. పరవాడ జవహర్లాల్ నెహ్రూ ఫార్మా సిటీకి ఆనుకొనివున్న గ్రామాలు వాయు కాలుష్యంతో తల్లడిల్లుతున్నాయి. ఇప్పటి కైనా ప్రభుత్వం కాలుష్య కారకమైన పరిశ్రమలు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కాలుష్యంలో అల్లాడిపోతున్న తాడి గ్రామం వెంటనే తరలించాలని కోరారు.

# విద్యార్థులతో మారు మోగుతున్న మాక్ అసెంబ్లీ.

**ముఖ్య అతిథులుగా హాజరుకానున్న చంద్రబాబు నాయుడు, నారా లోకేష్.**




**అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 23**: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న మాక్ అసెంబ్లీకు, గ్రాండివియస్ ఫంక్షన్ హాల్ లో చోడవరం లైన్స్ క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో బయలుదేరిన అనకాపల్లి జిల్లా విద్యార్థులు. ఈ సందర్భంగా కాంగ్రేగులు డేవిడ్ (అడ్వకేట్) మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల సమయంలో శాసనసభలో సభ్యులు ఏ విధంగా నడుచుకుంటారో, విధివిధానాలు పట్ల విద్యార్థులలో అవగాహన కల్పించేందుకు అమరావతి అసెంబ్లీలో మాక్ అసెంబ్లీ నిర్విస్తున్నారని తెలిపారు. ప్రజల ద్వారా శాసనసభకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు అసెంబ్లీలో ఏ విధంగా నడుచుకుంటారో, వారి కర్తవ్య నిర్వహణ ఏ విధంగా నిర్వహిస్తారో, చట్టసభలో శాసనాలు ఏ విధంగా రూపొందిస్తారు, సమస్యల పై ఏ విధంగా సభ్యులు చర్చిస్తారు అనే దాని పై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అంతే కాకుండా వారి ద్వారానే సభను నిర్వహించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు అని అన్నారు. ఇందుకు సంబంధించి 175 నియోజకవర్గాలలో గ్రామ స్థాయి నుండి విద్యార్థులకు పోటీలు నిర్వహించి నియోజకవర్గానికి ఒక్కరు చొప్పున ఎంపిక చేశారు. అనకాపల్లి నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సిగ్మెంటులో ఉన్న విద్యార్థులను మెరిట్ ద్వారా ఎంపిక చేశారు అని తెలియజేశారు. సోమవారం జరిగే మాక్ అసెంబ్లీలో కార్యక్రమానికి చోడవరం లైన్స్ క్లబ్ సహాయ సహకారాలతో విద్యార్థులు వెళ్తున్నారని తెలిపారు. చోడవరం లైన్స్ క్లబ్ సభ్యులు అందరం విద్యార్థుల్ని అభినందిస్తూ సత్కరించామని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు రాజకీయాల పట్ల అవగాహన కలిగి మంచి ప్రజా ప్రతినిధులుగా సేవలందించాలని ఆకాంక్షించారు. విద్యార్థి పూజిత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న మాక్ అసెంబ్లీకు ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో చోడవరం లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పూసర్ల సాంబశివ రావు, నరసయ్యపేట సర్పంచ్ నాగబాబు, లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ గణపతి నాయుడు, వేపాడ సత్యనారాయణ, గనిరెడ్డి, విద్యార్థులు, కే పూజిత, రావాడ నారాయణ మూర్తి, కేవిఎస్ఎస్ మణికంఠ, స్నేహలత, జోస్యన, గీతిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, చోడవరం లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో జిల్లా పోలీసులు

**అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 23:** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, భగవాన్ సత్యసాయి బాబా అందించిన మానవ సేవ-మానవతా విలువలను స్మరించుకుంటూ, శతజయంతి (100 వ జన్మదినోత్సవ) కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించు కొని, ప్రేమ స్వరూపు లైన భగవాన్ సత్యసాయి బాబా దివ్య అనుగ్రహం మనందరి పై, మన కుటుంబాల పై ఎల్లప్పుడూ ఉండాలి అని మనసారా కోరుకుంటూ, స్వామివారి శతజయంతి శుభాభినందనలు తెలియజేస్తున్నాము. కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.అశోక్ కుమార్, కార్యాలయ సిబ్బంది, భగవాన్ సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి వందనములు అర్పించారు. సేవ, సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ వంటి విలువలను పాటిస్తూ ప్రజలకు మరింత సేవ చేయడానికి సిబ్బంది సంకల్పబలం వ్యక్తం చేశారు.




# రాజయ్యపేట మత్స్యకారులను ప్రభుత్వం కనికరించలేదా?



**నక్కపల్లి, పెన్ సత్తా, నవంబర్ 23:**మత్స్యకారుల జీవనోపాదిని దెబ్బ తీసే బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని పోరాటం చేస్తున్న మత్స్యకారులపై ప్రభుత్వానికి కనికరం లేదా అని రాజయ్యపేట గంగ పుత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తీర ప్రాంతంలో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేసి సముద్రన్నే నమ్ముకుని జీవిస్తున్న గంగ పుత్రుల పొట్టకొట్టొదంటూ బల్క్ డ్రగ్స్ పరిశ్రమకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న శాంతియుత నిరాహార దీక్ష ఆదివారం నాటికి 71వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా మత్స్యకారుల మాట్లాడుతూ తరతరాలుగా సముద్రాన్నే నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటూ రాజయ్యపేటలోనే జీవనం సాగిస్తున్న మత్స్యకారుల జీవితాలను నాశనము చేయడానికే బల్క్ డ్రగ్స్ పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. ఇప్పటికే హెటిరో పరిశ్రమ వలన ఎన్నో కుటుంబాలు అనారోగ్యాల బారిన పడి నాశనం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో రసాయన పరిశ్రమలు వస్తే ఇక్కడ వాతావరణం తో పాటు సముద్రం కాలుష్యం అవుతుందని ఆవేదన తెలిపారు. ఇన్నిరోజులు గా మత్స్యకారులు, ప్రజా సంఘాలు, వామపక్షం, మహిళా సంఘాలు, ప్రతి పక్ష పార్టీలు గంగ పుత్రులకు అండగా, రసాయన పరిశ్రమలకు వ్యతిరేకం గా ఆందోళన చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు కనీసం స్పందించక పోవడం దారుణమన్నారు. మత్స్యకారులంతా తమ గ్రామాలను, గంగమ్మ తల్లిని కాపాడుకునేందుకు పనులకు వెళ్లకుండా పస్తులతో ఆందోళన చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా స్థానిక మంత్రి, ప్రభుత్వ పెద్దలు మత్స్యకార కుటుంబాల జీవితాలని దృష్టిలో ఉంచుకుని బల్క్ డ్రగ్స్ రద్దు ప్రకటన చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో .జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పి.సత్తయ్య,
పి. కోదండరావు, ఎం.మహేష్ బాబు, జి సోమేశ్వరరావు, వై. నాగేష్, కాశీరావు, అప్పలరాజు,చిట్టమ్మ , నూకమ్మ, వి. అప్పలరాజు కారే వెంకటేష్, బి.చిన్నతల్లి,
ఎం.కాశి, బి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మండలంలో కోటి సంతకాల సేకరణ





**నక్కపల్లి, పెన్ సత్తా, నవంబర్ 23 :** మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ మండలంలో పలు గ్రామాల్లో సంతకాల సేకరణ కొనసాగిస్తున్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు స్థానిక వైసీపీ నేతల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం నక్కపల్లి, గొడిచర్ల, చిన్నదొడ్డిగల్లు తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సంతకాలు సేకరించారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలంటూ సంతకాల సేకరించి గవర్నర్ కు అందజేయడం జరుగుతుందని స్థానిక వైసీపీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, రాజు, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

# సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో అన్న సమారాధన

**నక్కపల్లి, పెన్ సత్తా, నవంబర్ 23 :** మండల కేంద్రం నక్కపల్లి లో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం సత్య సాయి బాబా భక్తులు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 19 నుండి స్థానిక సత్య సాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో ప్రతీ రోజు ఓంకారం, సుప్రభాత సేవ, నగర సంకీర్తన, సాయి బాబా భజనలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి లో రోగులకు పాలు రొట్లు, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో పలువురు ప్రముఖులు పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.



# నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ .

- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.
- ఎమ్మిగనూరు పట్టణ ఎస్ ఐ. శ్రీనివాసులు

**పెన్ సత్తా, నవంబర్ 23**కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.అందులో భాగంగా ఎమ్మిగనూరు పట్టణ పోలీస్టేషన్ లో పట్టణ ఎస్ ఐ. శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణ పోలీస్టేషన్ నందు ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.



# నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ నాయకులు.



**చింతకాని పెన్ సత్తా, నవంబర్ 23 :**ఖమ్మంజిల్లాడీసీసీఅధ్యక్షుడిగా నూతన అధ్యక్షున్ని ఎన్నుకున్న సందర్భం గానూతిసత్యనారాయణనిమధిరఅమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లునందినివిక్రమార్క ఆధ్వర్యంలోశుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోచింతకానికాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కూరపాటికిషోర్,జిల్లా కాంగ్రెస్ నాయకులు కిలారి మనోహర్,ప్రొద్దుటూరు గ్రామ శాఖఅధ్యక్షుడుబ్రహ్మ చారి తదితరులు పాల్గొనడం జరిగింది.

# తేజావత్ లక్ష్మాకు నివాళులర్పించిన గ్రానైట్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు..



**తల్లాడ, పెన్ సత్తా, నవంబర్ 23**ఆర్కే గ్రానైట్ అధినేత తేజావత్ లక్ష్మా ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఆయన దశదిన కర్మ ఖమ్మం శ్రీనివాస్ నగర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ కిషన్, ఉపాధ్యక్షులు షేక్. నజీర్ పాషా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేసి వారిని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని అభయనిచ్చారు. నివాళులర్పించిన వారిలో ఈసీ మెంబర్లు శ్రీకాంత్, దిలీప్, అంజి తదితరులు ఉన్నారు.

# వనజీవి సినిమాలో తల్లాడ యువకులకు అవకాశం



**తల్లాడ పెన్ సత్తా, నవంబర్ 23**పర్యావరణ హితం కోసం జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ వనజీవి రామయ్య సినిమాలో నటించే అవకాశం తల్లాడ మండల యువకులను వరించింది.వనజీవి రామయ్య బయోపిక్ కథాంశంతో ప్రకృతి పరిరక్షణ ఫిలిమ్స్ పతాకంపై ప్రముఖ సినీ హీరో బ్రహ్మాజీ,నటి నాగమణి హీరో, హీరోయిన్లుగా దర్శకుడు వేముగంటి,నిర్మాత లింగంపల్లి చంద్రశేఖర్, సంగీత దర్శకుడు బల్లేపల్లి మెహన్, కెమెరామెన్ రమణ,గార్ల రాంబాబు సారధ్యంలో వనజీవి రామయ్య సినిమాను నిర్మిస్తున్నారు.విస్తృత్తంగా మొక్కలు నాటి వాటి సంరక్షణ కోసం కృషి చేస్తూ వనజీవి రామయ్య ఆశయ సాధనలో మేము సైతమంటూ.. ముందుండే తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన దాసరి పద్మ స్మారక యువజన సమాఖ్య, మల్లవరం కు చెందిన దాసరి వీరభద్రరావు యూత్ క్లబ్ సభ్యులకు వనజీవి రామయ్య సినిమాలో నటించే అవకాశాన్ని దర్శకుడు వేముగంటి,నిర్మాత చంద్రశేఖర్ కల్పించారు.ఖమ్మం నగరంలోని నేచర్ వ్యాలీ లో జరిగిన సినిమా షూటింగ్ లో భాగంగా పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ, వనజీవి రామయ్య కు కలెక్టర్ ద్విచక్ర వాహనాన్నిబహుకరించే సన్నివేశాలను వీరితో చిత్రీకరించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న వనజీవి రామయ్య సినిమాలో నటించే అవకాశం కల్పించిన దర్శక, నిర్మాతలకు దాసరి పద్మ స్మారక యువజన సమాఖ్య, దాసరి వీరభద్రరావు యూత్ క్లబ్ అధ్యక్షులు గుమ్మా నరేష్, దుగ్గిదేవర అజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఉద్యోగాలపై ఎలాన్ మస్క్ నుంచి సంచలన విషయం!



ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ నుంచి ఓ షాకింగ్ విషయం తెరపైకి వచ్చింది. వాస్తవానికి గత కొంతకాలంగా ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని కొందరంటే.. ఏఐ వల్ల అలాంటి ప్రమాదం ఏమీ లేదనేది మరికొందరి వాదనగా వినిపిస్తోన్న వేళ.. అందుకు పూర్తి విభిన్నంగా అన్నట్లుగా ఎలాన్ మస్క్ నుంచి సంచలన స్టేట్ మెంట్ తెరపైకి వచ్చింది. అదే త్వరలో 'జాబ్ ఒక ఆప్షనల్' అని!

అవును... పని భవిష్యత్తు గురించి ఎలాన్ మస్క్ ఓ అద్భుతమైన అంచనా వేశారు. ఇందులో భాగంగా... రాబోయే దశాబ్దాల్లో చాలా మందికి ఉద్యోగం ఒక ఆప్షన్ గా మారవచ్చని అన్నారు. యూఎస్-సౌదీ ఇన్వెస్ట్ మెంట్ ఫోరమ్ లో మాట్లాడిన ఆయన... ఏఐ, రోబోటిక్స్ లో పురోగతి సమాజాన్ని ఎలా పునర్నిర్మించగలదో, సాంప్రదాయ ఉద్యోగాల అవసరాన్ని ఎలా ప్రభావితం చేయగలదనే విషయాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా స్పందించిన ఎలాన్ మస్క్... దీర్ఘకాలికం అంటే నాకు కచ్చితంగా తెలియదు కానీ... బహుశా 10 నుంచి 20 సంవత్సరాలలో తన అంచనా ప్రకారం ఉద్యోగం లేదా పని అనేది ఐచ్ఛికం అని అన్నారు. భవిష్యత్తులో పనిని ఆటలు ఆడటం లేదా వీడియో గేమ్స్ ఆడటం, సంగీతం వినడం వంటి కార్యకలాపాలతో పోల్చారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎంపికలు ఉంటాయని తెలిపారు.

**డబ్బు దాని ప్రాముఖ్యతను కోల్పోవచ్చు!:**

ఈ మార్పు కేవలం పనిలోనే కాకుండా ఆర్థిక వ్యవస్థలోనూ విప్లవాత్మక మార్పులకు దారితీస్తుందని మస్క్ భావించారు. ఇందులో భాగంగా... భవిష్యత్తులో ఏఐ, రోబోటిక్స్ ఆధిపత్యం చెలాయించే కాలంలో డబ్బు దాని ప్రాముఖ్యతను కోల్పోవచ్చని మస్క్ అన్నారు. సాంప్రదాయ కరెన్సీని వాడుకలో లేనిదానిగా చేసే ఏఐ సమాజాన్ని ఆయన ప్రస్తావించారు.

ఈ నేపథ్యంలో మానవ జీవితంలో కరెన్సీకి నేడు ఉన్నంత విలువ ఉండకపోవచ్చని తెలిపారు. ఇదే సమయంలో... ఏఐ, హ్యూమనాయిడ్ రోబోలు వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా పేదరికాన్ని నిర్మూలిస్తాయని మస్క్ పేర్కొన్నారు. ప్రస్తుతం టెస్లా ఈ రంగానికి నాయకత్వం వహిస్తుండగా.. ఫ్యూచర్ లో అనేక కంపెనీలు ఈ హ్యూమనాయిడ్ రోబోల ఉత్పత్తి రంగంలోకి అడుగుపెడతాని తెలిపారు.

# 16 ఏళ్ల ఉమ్మడి జీవితం ఒక్క క్షణంలో ముగిసిన వేళ..!





దుబాయ్ ఎయిర్ షో లో విన్యాసాలు నిర్వహిస్తుండగా తేజస్ జెట్ కూలి, అందులోని పైలట్ వింగ్ కమాండర్ నమాంశ్ సయాల్ దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఆయన నివాసం వద్ద హృదయ విదారక దృశ్యాలు కనిపిస్తున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మరోవైపు దేశం మొత్తం ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తోంది. అవును... దుబాయ్ ఎయిర్ షోలో జరిగిన ప్రదర్శనలో భారత వైమానిక దళ పైలట్ వింగ్ కమాండర్ నామాంశ్ సయాల్ మరణించిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో తమ ధైర్యవంతుడైన కుమారుడు ఇకపై తమతో లేడని కుటుంబం ఇప్పటికీ నమ్మలేకపోతోంది. ఈ సందర్భంగా నామాంశ్ ప్రేమ వివాహం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా ఆయన భార్య, కుమార్తె గురించి అయినవారు మరింత కన్నీరుమున్నీరవుతున్నారు.

హిమాచల్ ప్రదేశ్ లోని కాంగ్రాకు చెందిన నామ్నాష్ ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆయన భార్య అఫ్సానా కూడా భార వైమానిక దళలో అధికారిణి కావడం గమనర్హం. వీరిద్దరూ తమ ప్రయాణంలో ఎన్నో కలలు కన్నారు, దేశాన్ని రక్షించడానికి కలిసి ప్రమాణం చేసి, ప్రయాణిస్తున్నారు. అయితే తేజస్ కూలిపోవడంతో వీరి 16 ఏళ్ల ఉమ్మడి జీవితం ఒక్క క్షణంలో ముగిసింది! వీరికి 7ఏళ్ల కుమార్తె ఉంది.

**చివరి క్షణంలో దూకే ప్రయత్నం!:**

దుబాయ్ ఎయిర్ షోలో తేజస్ జెట్ విమానం తక్కువ ఎత్తులో వైమానిక విన్యాసం చేస్తుండగా.. అది నేలపైకి దూసుకెళ్లిన వెంటనే భారీ అగ్నిగోళంగా మారిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన తాజా వీడియో సంచలనంగా మారింది. ఈ క్రమంలో.. ఈ ప్రమాదం చివరి సెకన్లలో ఏమి జరిగిందో కొత్త వీడియో స్పష్టంగా చూపిస్తుందనే చర్చ తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా... విమానంలో మంటలు వ్యాపించిన సమయంలో పారాచూట్ లాంటి వస్తువు కనిపిస్తుంది! అంటే... ప్రమాదాన్ని గ్రహించిన పైలెట్ బయటకు రావడానికి ప్రయత్నించాడని.. కానీ, అప్పటికే చాలా ఆలస్యం అయ్యిందనే విషయాన్ని ఇది సూచిస్తుందని నిపుణులు చెబుతున్నారు. పైలెట్ తిరిగి కంట్రోల్ సాధించడానికి, విమానాన్ని కాపాడటానికి ప్రయత్నించడంవల్ల ఇది జరిగి ఉంటుందని అంటున్నారు.

**తేజాస్ లో మొదటి మరణం!:**

భారతదేశంలో మొట్టమొదటి స్వదేశీ తేలికపాటి మల్టీరోల్ ఫైటర్ జెట్ అయిన తేజాస్.. దాని 10 సంవత్సరాల సేవలో ఇదే మొదటి మరణంగా నిలిచింది. వాస్తవానికి గత ఏడాది మార్చిలో జైసల్మేర్ సమీపంలో ఒక తేజస్ కుప్పకూలినపటికీ.. ఆ ఘటనలో పైలట్ సురక్షితంగా బయటపడగలిగారు.

# టీవీకే మేనిఫెస్టో లీక్ ఇచ్చిన విజయ్.. ఇవి తాజా సంచలనం!



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా నాలుగు నుంచి ఐదు నెలల వ్యవధి మాత్రమే మిగిలి ఉండటంతో.. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాయి. ఈ విషయంలో సినీనటుడు, టీవీకే అధినేత విజయ్.. కరూర్ ఘటన అనంతరం జనాల్లోకి వచ్చారు. ఈ సందర్భంగా తన పార్టీ మేనిఫెస్టోలోని అంశాల్లో కొన్ని కీలక విషయాలను వెల్లడించారు. ఇవి చర్చనీయాంశంగా మారాయి.

అవును... వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో రాజకీయాలు హాట్ హాట్ గా మారుతున్నాయి. ఆ వేడిని మరింత పెంచే క్రమంలో అన్నట్లుగా టీవీకే పార్టీని స్థాపించిన సినీ నటుడు విజయ్.. సరికొత్త హామీలతో తెరపైకి వచ్చారు. తాజాగా ఓ ఇంజినీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో ముందుగా ఎంపిక చేసిన కార్యకర్తలు, ప్రజలతో విజయ్ మాట్లాడారు. ఈ సందర్భంగా తన ఆశయాలు, లక్ష్యాలను వివరించారు! తాజాగా జరిగిన సమావేశంలో మైకందుకున్న విజయ్... అధికార డీఎంకే తనపై చేస్తోన్న విమర్శలపై స్పందించారు. టీవీకేకూ స్పష్టమైన రాజకీయ ప్రణాళిక లేదని చేసిన విమర్శపై స్పందిస్తూ.. ప్రజలను దోచుకుంటున్న డీఎంకేకు టీవీకే ఆదర్శాలను ప్రశ్నించే హక్కు లేదని.. సమానత్వం అనే ఆదర్శంతోనే టీవీకే ఏర్పడిందని విజయ్ తెలిపారు. ఇదే సమయంలో.. రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా నుంచి విద్యను రాష్ట్ర జాబితాకు మార్చాలనే కీలక డిమాండ్ ను తెరపైకి తెచ్చిన విజయ్... త్వరలో వివరణాత్మక మ్యానిఫెస్టోను విడుదల చేస్తామని తెలిపారు. ఈ విధంగా తన మ్యానిఫెస్టోలోని కొన్ని కీలక అంశాలను మాత్రం ప్రజలకు వివరించారు. ఇందులో ప్రధానంగా ప్రజలందరికీ సొంతిల్లు, ప్రతీ ఇంటికీ బైక్ అనే అంశాలను తెరపైకి తెచ్చారు.

ఈ సందర్భంగా... ప్రజలందరికీ సొంతిల్లు, ప్రతీ ఇంటికీ బైక్, కారు ఉండేలా చూస్తానని.. అదే సమయంలో శాంతిభద్రతలను కఠినతరం చేస్తానని చెప్పిన విజయ్... ఈ హామీలపై వివరణాత్మక నివేదికను త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా ప్రతీ కుటుంబానికి బైక్, కారు అందించడమే టీవీకే లక్ష్యమని తెలిపారు. అదేవిధంగా... ప్రతీ ఇంట్లో ఒక పట్టభద్రుడికి భరోసా కల్పిస్తామని అన్నారు.

అదేవిధంగా... విద్యారంగంలోనూ పలు సంస్కరణలు తీసుకొస్తామని విజయ్ ప్రకటించారు. మత్స్యకారులు, కార్మికులు, నేత కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో సంప్రదించి అభివృద్ధి ప్రాజెక్టులను అమలు చేస్తామని.. విపత్తులను నివారించడానికి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని విజయ్ ప్రకటించారు.

కాగా.. కరూర్ లో జరిగిన తొక్కిసలాట విషాదం తర్వాత ఆగిపోయిన తన ఎన్నికల ప్రచార కార్యకలాపాలను విజయ్ తిరిగి ప్రారంభించారు. ఇందులో భాగంగా... టీవీకే కార్యకర్తలు, తన మద్దతుదారులతో కాంచీపురం జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక ఇంజినీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో 2000 మంది హాజరయ్యారు.

# 2026లో ఏ డిగ్రీలు చేసిన వారికి ఎక్కువ ఉద్యోగ అవకాశాలో తెలుసా?



ఏ డిగ్రీ చదివితే ఉద్యోగం తొందరగా వస్తుంది? ఈ ప్రశ్నలు నిత్యం వినిపించేవే, చాలా మందిలో కనిపించేవే! ఈ సమయంలో.. కాలేజీలు, విద్యార్థులు, రిక్రూటర్లు అత్యంత ఉపాధి అవకాశాలున్న డిగ్రీల గురించి మాట్లాడేటప్పుడు ఎక్కువగా టెక్నికల్ ఎడ్యుకేషన్ పై చర్చ జరుగుతుంటుంది. ఈ సమయంలో తాజాగా "ఇండియా స్కిల్స్ రిపోర్ట్ – 2026" కొన్ని కీలక విషయాలు వెల్లడించింది. అవును... ఏ డిగ్రీ చేస్తే ఎక్కువ ఉపాధి అవకాశాలకు అవకాశం ఉందనే చర్చ నిత్యం జరిగేదే. అయితే దీనికి సంబంధించిన లెక్కలు ప్రతి ఏటా మారుతున్నాయి. ఈ విషయంలో ప్రధానంగా ఎంబీయే గురించి చెప్పుకోవచ్చు. గత ఏడాది ఈ డిగ్రీ చేసిన వారి ఉద్యోగ సామర్థ్యం 78%గా ఉండగా.. ఇప్పుడు దాని సామర్థ్యం తగ్గింది. ఇందులో భాగంగా... ఇప్పుడు ఆ సంఖ్య 72.76%గా ఉంది.

**సీఎస్, ఐటీ కి బిగ్ ఛాన్స్!:**


తాజా నివేదిక ప్రకారం.. కంప్యూటర్ సైన్స్ (సీఎస్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) గ్రాడ్యుయేట్లు భారతదేశంలో అత్యధికంగా ఉపాధి పొందేందుకు అర్హులుగా కొనసాగుతున్నారు. ఈ నివేదిక సీఎస్, ఐటీ గ్రాడ్యుయేట్ల డిమాండ్ ను పరిశ్రమలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ టెక్నాలజీ లను డిగ్రీలతో పాటు నేరుగా అనుసంధానిస్తుందని అంటున్నారు! ఇదే క్రమంలో... ఎంట్రీ లెవెల్ ప్రతిభ కలిగి ఉన్నవారిలో ఐటీ అగ్రస్థానంలో ఉందని.. మొత్తం ఫ్రెషర్స్ లో 35% మంది ఐటీ ఉద్యోగాలలోకి నియమితులవుతున్నారని నివేదిక పేర్కొంది. ఈ సంఖ్య సీఎస్, ఐటీ గ్రాడ్యుయేట్లు ఇంత స్థిరమైన ఉపాధిని ఎందుకు పొందుతున్నారో వివరిస్తుంది! అయితే కేవలం డిగ్రీలు మాత్రమే కాకుండా.. వీటికి తోడు ఏఐ లేదా క్లౌడ్ వంటి స్పెషలైజేషన్స్ ఉంటే అది మరింత సురక్షితమని అంటున్నారు!

**తగ్గుతోన్న ఎంబీయే ఉద్యోగ సామర్థ్యం!:**

వాస్తవానికి గతంలో ఎంబీయే ఉద్యోగ సామర్థ్యం 78%గా ఉండగా... 2026లో దాని ఉద్యోగ సామర్థ్యం 72.76% కి తగ్గింది. తాజా నివేదికలో ఇది ఒక ముఖ్యమైన మార్పు అని చెప్పొచ్చు. అందుకు ప్రధాన కారణం... క్లాసికల్ మేనేజ్మెంట్ గ్రాడ్యుయేట్ల కంటే అనాలసిస్, టెక్ ఆధారిత కార్యకలాపాలు కలగలిపిన డిజిటల్ అవగాహన ఉన్న ఎంబీయేలను యజమానులు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడమే అని అంటున్నారు. అంటే.. సాధారణ ఎంబీయే ఇకపై సరిపోదన్నమాట!

ఇదే క్రమంలో బీకాం వంటి కామర్స్ కోర్సులకు ఉద్యోగ సామర్థ్యం 62.81% గా ఉండగా.. ఐటీయేతర సైన్స్ కోర్సులకు 61%.. ఆర్ట్స్ కోర్సులకు 55.55%.. ఐటీఐ 45.95%.. పాలిటెక్నిక్ (డిప్లొమా) 32.92% గా ఉందని నివేదిక వెల్లడించింది. ఫైనల్ గా ఈ ఇండియా స్కిల్స్ రిపోర్ట్ – 2026 చెప్పేదేమిటంటే... ఇకపై డిగ్రీ మాత్రమే కీలకం కాదు.. దీనికి సరైన నైపుణ్యాలు తోడవ్వడం కచ్చితంగా అది కీలకం. ఈ క్రమంలో.. డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్, ఏఐ కారణంగా సీఎస్ (80%), ఐటీ (78%) ఉపాధి సామర్థ్యాల్లో అగ్రస్థానంలో నిలిచాయి. ఇదే సమయలో డేటా లేదా డొమైన్ బలం జత చేయకపోతే ఎంబీయే బ్రైట్ నెస్ తగ్గుతుంది!

# 42 సరస్సులు బద్దలయ్యేందుకు సిద్ధం.. వణుకుతున్ననేపాల్



మన పొరుగున ఉన్న బుజ్జి దేశం నేపాల్. అక్కడి ఒక ప్రావిన్స్ లో 42 సరస్సులు అత్యంత ప్రమాదకరంగా మారాయన్న విషయాన్ని బయటపెట్టాడు మన దేశానికి చెందిన నిపుణుడు. నేపాల్ లో అత్యంత ఎత్తైన పర్వతాల మధ్య ఏర్పడిన హిమానీ సరస్సులు (వీటినే గ్లేసియర్ లేక్స్) ఇప్పుడు దిగువ ప్రాంతాల ప్రజలపై యమపాశాలుగా మారేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా అంతర్జాతీయ సమీకృత పర్వతాభివృద్ధి కేంద్రం నిర్వహించిన చర్చా కార్యక్రమంలో భారత్ కు చెందిన ఈ రంగ నిపుణుడు శరద్ ప్రసాద్ జోషి హెచ్చరించారు. ఈ హెచ్చరికతో నేపాలీయులు కళ్లు తెరిచారు. ఇప్పుడేం చేయాలో అర్థం కాని పరిస్థితి. గ్లేసియర్ నుంచి ప్రవహించే నీటి కారణంగా పర్వత సానువుల వద్ద ఏర్పడే సరస్సుల్ని గ్లేసియర్ లేక్ లుగా వ్యవహరిస్తారు. ఈ తరహాకు చెందిన 42 సరస్సులు భారీ స్థాయిలో నీటితో నిండుకుండలా మారాయి. ఇవే క్షణంలో అయినా బద్ధలై దిగువకు పెద్ద ఎత్తున నీరు దూసుకురానుంది. అదే జరిగితే.. దిగువన ఉన్న ప్రాంతాల్లోని ప్రజల ఇళ్లు.. వ్యాపారాలు.. పంటలు నాశనం కావటం ఖాయం. నేపాల్ మొత్తంలో ఈ తరహా హిమానీ సరస్సులు 2069 ఉండగా.. కోషి ప్రావిన్స్ లోని 42 సర్పసులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. మూడు కిలో మీటర్ల పొడవు.. 206 మీటర్లలోతైన తల్లోపోఖారీ సరస్సు ఇందులో మరింత డేంజర్ గా మారినట్లుగా ఆయన పేర్కొన్నారు. భారత నిపుణుడి హెచ్చరిక నేపథ్యంలో ఈ గండం నుంచి ప్రజల్ని గట్టెక్కించేందుకు వీలుగా నేపాల్ కు చెందిన వివిధ విభాగాలు ఫోకస్ చేశాయి. మొత్తంగా విపత్తు విరుచుకుపడేందుకు సిద్ధంగా ఉన్న అంశాన్ని మనోడు చేసిన హెచ్చరిక.. నేపాల్ కు హెచ్చరికగా మారి.. నష్టాన్ని అంతో ఇంతో తగ్గించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.



# మానసిక ఆరోగ్యం సరిగా లేకపోతే గుండెపోటు వస్తుందా?

మానసిక ఆరోగ్య సమస్యలు కూడా గుండె సమస్యలకు కొత్త ప్రధాన ప్రమాద కారకంగా మారుతున్నాయి. అధిక కొలెస్ట్రాల్, మధుమేహం, అధిక రక్తపోటు, ధూమపానం వంటివి ఇప్పటికే గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. కానీ, నిపుణులు ఇప్పుడు ఒత్తిడి, నిరాశ లేదా ఇతర మానసిక ఆరోగ్య సమస్యలు కూడా గుండెను ప్రభావితం చేస్తాయని అంటున్నారు. డిప్రెషన్, ఆందోళన 50 శాతం గుండె సమస్యలను పెంచుతాయని ఆరోగ్య నిపుణులు షాకింగ్ విషయాలు వెల్లడించారు.

### మానసిక ఒత్తిడి గుండెను ఎలా ప్రభావితం చేస్తుంది?

మనం దీర్ఘకాలిక ఒత్తిడి లేదా ఆందోళనలో ఉన్నప్పుడు, శరీరం కార్టిసాల్, కాటెకోలమైన్‌లు వంటి ఎక్కువ హార్మోన్లు, న్యూరోట్రాన్స్‌మిటర్‌లను (ఉదాహరణకు, అడ్రినలిన్) ఉత్పత్తి చేస్తుంది. ఈ హార్మోన్లు హృదయ స్పందన రేటు, రక్తపోటును పెంచుతాయి.

### గుండెపై ఒత్తిడి ప్రమాదాలు

మానసిక ఒత్తిడి గుండెను నేరుగా ప్రభావితం చేయడమే కాకుండా, దాని ఇతర దుష్ప్రభావాలు కూడా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తి ఒత్తిడికి గురైనప్పుడు, వారు తరచుగా ఒకే చోట పడుకున్నట్లు లేదా కూర్చున్నట్లు భావిస్తారు. ఒత్తిడికి గురైన వ్యక్తులు తక్కువ చురుగ్గా ఉంటారు. వ్యాయామంపై కూడా దృష్టి పెట్టరు. ఎక్కువసేపు ఒత్తిడి ఉండటం లేదా శారీరక శ్రమ లేకపోవడం వల్ల గుండె కండరాలపై ఒత్తిడి పెరిగి అవి బలహీనపడతాయి, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది.

### అనారోగ్యకరమైన ఆహారం

చాలా మంది ఒత్తిడిలో జంక్ ఫుడ్, వేయించిన ఆహారాలు, స్వీట్లు ఎక్కువగా తింటారు. ఈ ఆహారాలు బరువు పెరగడానికి దారితీయడమే కాకుండా రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను కూడా తీవ్రతరం చేస్తాయి, ఇది రక్త నాళాలపై మరింత ఒత్తిడిని కలిగిస్తుంది. గుండెను బలహీనపరుస్తుంది.

### నిద్రలేమి

ఒత్తిడి, ఆందోళన నిద్రలేమికి దారితీయవచ్చు. దీని వలన రక్తపోటు పెరుగుతుంది. ఇది నేరుగా గుండెపై ప్రభావం చూపుతుంది. నిద్ర లేకపోవడం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

### మందులు తీసుకోకపోవడం

రక్తపోటు లేదా మధుమేహం వంటి సమస్యలకు ఇప్పటికే మందులు తీసుకుంటున్న వారు, ఒత్తిడి కారణంగా మందులు వేసుకోకుండా ఇబ్బంది పడుతుంటారు. తరచుగా వారు మందులు సకాలంలో తీసుకోవడం మర్చిపోతారు. దీనివల్ల వ్యాధి అదుపు తప్పి తీవ్రమైన గుండె సమస్యలకు దారితీస్తుంది.



# వినికిడి లోపిస్తే



వినికిడి పరికరం వాడకాన్ని చిన్నతనంగా భావించి దాని జోలికి వెళ్లని వాళ్లుంటారు. వినికిడి లోపం ఉన్నా ఆ విషయాన్ని ఒప్పుకోడానికి తటపటాయించే వాళ్లుంటారు. 'వినికిడి పూర్తిగా పోయినప్పుడు ఆలోచిద్దాంలే!' అనుకుంటూ హియరింగ్ ఎయిడ్స్ వాడకానికి దూరంగా ఉండిపోయే వాళ్లుంటారు. కానీ వీటిని వాడకపోవడం వల్ల, దాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం క్రమేపీ తగ్గిపోయి, వినికిడిని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందంటున్నారు

వైద్యులు వినికిడి లోపం జీవితంలో ఎప్పుడైనా తలెత్తవచ్చు. పుట్టుకతోనే ఈ లోపం ఉండొచ్చు. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు, కొన్ని రకాల మందులు, పైబడే వయసు, పెద్ద శబ్దాలకు బహిర్గతమవడం వల్ల కూడా వినికిడి లోపం తలెత్తవచ్చు.

వృద్ధాప్యం: పైబడే వయసులో కంటిచూపు తగ్గినట్టే, 50 ఏళ్లు పైబడిన తర్వాత వినికిడి శక్తి కూడా తగ్గుముఖం పడుతుంది. ఈ సమస్య వంశపారంపర్యంగా కూడా సంక్రమిస్తుంది. అయితే, సాధారణంగా వినికిడి శక్తి తగ్గడం మొదలుపెట్టినప్పుడు పైబడే వయసులో ఇదంతా మామూలే అనుకుంటూ హియరింగ్ ఎయిడ్ వాడకాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ హియరింగ్ ఎయిడ్ వాడకంతో కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తీసుకురాలేకపోయినప్పటికీ, వినికిడి పరికరాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం తగ్గకుండా ఉంటుంది. కాబట్టి సమస్యను గుర్తించిన వెంటనే హియరింగ్ ఎయిడ్‌ను వాడుకోవడం మొదలుపెట్టాలి. మరీ ముఖ్యంగా వినికిడి శక్తి లోపించడం వల్ల ఆత్మవిశ్వాసం దెబ్బతిని, నలుగురిలో కలవలేక, మానసిక కుంగుబాటుకు లోనై, ఒంటరిగా గదికే పరిమితమైపోతూ ఉంటారు. దాంతో జీవన నాణ్యత కూడా దెబ్బ తింటుంది. కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదు.

పుట్టుకతోనే: పుట్టుకతోనే సంక్రమించే జన్యుపరమైన వ్యాధుల్లో వినికిడి లోపం కూడా ఒకటి. మేనరికం వివాహాల్లో పుట్టిన పిల్లల్లో ఈ సమస్య సహజం.

వ్యాధులు: మలేరియా, టైఫాయిడ్ లాంటి వైరల్ జ్వరాలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వినికిడికి సంబంధించిన నాడిని దెబ్బతీస్తాయి.

మందులు: జెంటామైసిన్, అమికాసిన్ లాంటి ఆటోటాక్సిక్ మందులు, కీమోథెరపీ మందులు, మలేరియా మందుల వాడకం వల్ల కూడా లోపలి చెవి దెబ్బతిని వినికిడి శక్తి తగ్గవచ్చు.

### పిల్లల్లో వినికిడి లోపం

మేనరికం వివాహాల వల్ల లేదా ఇతరత్రా జన్యు సమస్యల వల్ల కొందరు పిల్లలు పుట్టుకతోనే వినికిడి సమస్యను వెంట తెచ్చుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో పసికందులు శబ్దాలకు స్పందించడం లేదని గ్రహించిన వెంటనే 'బేరా' (బ్రెయిన్ స్టెమ్ ఎవోక్‌డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ పరీక్ష చేయించాలి. ఈ పరీక్షతో పసికందుల వినికిడి లోపం ఏ మేరకు ఉందన్నది తెలుస్తుంది. అలాగే పది నెలలు దాటిన పిల్లలు చప్పుళ్లకు స్పందించకపోయినా, ఈ పిల్లలకు మాటలు రాకపోతున్నా వెంటనే అప్రమత్తం కావాలి. ఏడాది లోపున్న పసిపిల్లల్లో వినికిడి శక్తి లోపిస్తే, కోక్లియర్ ఇంప్లాంట్ అమర్చవలసి ఉంటుంది. దీంతో వినికిడి శక్తి పెరిగి పిల్లల ఎదుగుదల ఆరోగ్యకరంగా సాగుతుంది. ఈ ఇంప్లాంట్‌ను అమర్చడం కోసం వైద్యులు పుర్రె లోపల వినికిడి నాడికి ఎలక్ట్రోడ్స్‌ను అనుసంధానించి, కోక్లియాను అమరుస్తారు. చెవి దగ్గర బహిర్గతమయ్యే విడి భాగంలో అవసరాన్ని బట్టి బ్యాటరీలను మార్చుకుంటూ పిల్లలు జీవితకాలం పాటు ఈ వినికిడి పరికరాన్ని వాడుకోవచ్చు.

### ఇది తాత్కాలికమే!

వానాకాలంలో సాధారణ జలుబులతో తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. సాధారణంగా ఇది పిల్లల్లో కనిపిస్తూ ఉంటుంది. అలాగే అలర్జీల వల్ల, చలికి బహిర్గతమవడం వల్ల, జలాంతర క్రీడల వల్ల, విమానం నేల మీదకు దిగేటప్పుడు కర్ణభేరి మీద ఒత్తిడి పెరిగి, చెవి పోటు, తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. విమానం కిందకు దిగే సమయంలో చెవి పోటు, దిబ్బెడ వేధించే సమస్య ఉన్నవాళ్లు ప్రయాణానికి ముందు ఆవిరి పట్టుకోవాలి. అలాగే విమానం దిగడానికి అరగంట ముందు యాంటీ హిస్టమిన్ మాత్ర వేసుకోవాలి. అలాగే అలర్జీలు, జలుబులకు చికిత్స తీసుకోవాలి. వీటితో తాత్కాలిక వినికిడి లోపం తగ్గిపోతుంది. పబ్‌లు, డిజెల్లోని బిగ్గర శబ్దాలకు బహిర్గతమైన తర్వాత చెవిలో గుయ్యిమనే శబ్దంతో పాటు వినికిడి తగ్గితే వెంటనే వైద్యులను కలిసి చెవి ఇంజక్షన్లు తీసుకోవాలి. లేదంటే కోల్పోయిన వినికిడి శక్తి తిరిగొచ్చే వీలుండదు. ఇలా జరగకుండా ఉండాలంటే, బిగ్గర శబ్దాలతో కూడిన ప్రదేశాలను సందర్శించేటప్పుడు, స్పీకర్లకు దూరంగా ఉంటూ, ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అలాగే దీపావళి నాడు టపాసులు కాల్చే సమయంలో కూడా ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అయితే అప్పటికే చెవి సమస్యలతో బాధపడుతున్న వాళ్లు టపాసుల శబ్దాలకు ఏమాత్రం బహిర్గతం కాకుండా, గదులకే పరిమితం కావాలి.

### అకస్మాత్తుగా వినికిడి కోల్పోతే...

కారణం ఏదైనా అకస్మాత్తుగా వినికిడి శక్తి కోల్పోతే, తిరిగి వచ్చేస్తుందిలే అని తాత్సారం చేయడం సరికాదు. ఇలాంటి సందర్భాల్లో ఎంత త్వరగా చికిత్స అందించగలిగితే, వినికిడి శక్తి అంత త్వరగా తిరిగొస్తుంది. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రతించగలిగితే, చెవిలోకి ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తెప్పించవచ్చు.

# హై బీపీ సమస్య ఇబ్బంది పెడుతోందా?.. జస్ట్ ఈ సింపుల్ చిట్కాలు..



ప్రస్తుతం హై బీపీ సమస్య అందరిని ఇబ్బంది పెడుతోంది. వైద్యులు వద్దకు వెళ్లితే.. భారీగా ఫీజు వసూల్ చేస్తున్నారు. దీనితోపాటు అత్యంత ఖరీదైన మందులు రాస్తున్నారు. దీంతో జేబుకు చిల్లు.. అది కూడా గట్టిగా పడుతుంది. అయితే ఇంట్లోనే మనం తినే.. తీసుకునే ఆహారంలో కొద్ది పాటు మార్పులు చేర్పులతో ఈ హై బీపీ సమస్యను దాదాపుగా నియంత్రించువచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అందుకు ఆరు చక్కటి పరిష్కారాలను వారు సోదాహరణగా వివరిస్తున్నారు.

మొదటిది.. కీర దోసకాయ.. బీపీని నియంత్రించడానికి ఇది చాలా బాగా పని చేస్తుంది. కేజీ కీర దోసకాయ ఖరీదు చాలా స్వల్పంగానే ఉంటుందన్న విషయం అందరికి తెలిసిందే. వీటిని రోజు తీసుకోవడం ద్వారా సులభంగా హై బీపీని నియంత్రివచ్చు.

రెండోవది.. రాతి ఉసిరి (ఆమ్లా).. ఇందులో ఎన్నో పోషకాలతోపాటు విటమిన్లు సైతం ఉంటాయి. ఇది సహజ సిద్ధంగా లభిస్తుంది. అంతేకాకుండా దీని వల్ల అనేక ఆరోగ్య లాభాలు కూడా ఉన్నాయి. ఇది శరీరాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. అంటే శరీరంలోని విషాన్ని పూర్తిగా తొలగించే శక్తి.. ఈ రాతి ఉసిరికి ఉంది. ఈ రాతి ఉసిరి.. షుగర్, హై బీపీలను తగ్గించడమే కాకుండా బరువు తగ్గడంలో సైతం కీలకంగా వ్యవహరిస్తోంది.

మూడోవది అన్ని కూరగాయలు.. మరి ముఖ్యంగా బెల్ పెప్పర్స్ (సిమ్లా మిర్చి). ఇందులో రంగులు ఉంటాయి. అంటే పసుపు, ఎరుపు, పచ్చని క్యాప్సికమ్ మిర్చి లభిస్తుంది. ఏ రంగులో ఉన్న ఈ మిర్చి తీసుకున్నా.. బీపీ మాత్రం నియంత్రణలోకి వస్తుంది. అలాగే క్యారెట్ సైతం బీపీ తగ్గడానికి సహాయపడుతుంది.

నాలుగోది.. ముల్లంగి (ర్యాడిష్) ఇది కొద్దిగా ఘాటుగా ఉంటుంది. అందుకే దీనిని తినడానికి ఎవరూ అంతగా ఇష్టపడరు. కానీ దీనిని కూరగా చేసుకుని తీసుకుంటే మాత్రం చాలా మంచిది.

ఐదోవది.. మజ్జిగ (బటర్ మిల్క్): చాలా పల్చగా చేసుకుని మజ్జిగ తాగాలి. అందులో కొద్దిగా జీలకర్ర పొడితోపాటు సొంపు పొడి వేసుకుని తీసుకుంటే వెంటనే రిలీఫ్ ఉంటుంది. పేగులు సైతం ఆరోగ్యంగా ఉంటాయి.

ఆరోవది.. రాత్రి సమయంలో గ్లాస్ వాటర్ తీసుకోవాలి. టీ స్పూన్ సొంపు, జీలకర్ర, ఒక దాల్చిన చెక్కను నీటిలో వేసి నానబెట్టాలి. ఉదయం అందులో పొదీనా వేయాలి. ఈ మిశ్రమంలో ఆఫ్ టీ స్పూన్ ములగాకు పొడి కూడా వేసి బాగా మరిగించాలి. అనంతరం వడ పోసుకుని.. అందులో నిమ్మకాయ పిండుకుని తాగితే.. బీపీ వెంటనే కంట్రోల్ అవుతుంది. ఇది క్రమం తప్పకుండా ప్రతి రోజు తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

# సోరియాసిస్‌కు సమర్థమైన వైద్యం



తిరగబెడుతూ వేధించే చర్మ వ్యాధుల్లో సోరియాసిస్ ఒకటి. అయితే శరీర తత్వం, ప్రేరేపించే అంశాలు, మందుల ప్రభావాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ మొండి సమస్యను కూడా పరిష్కరించుకోవచ్చు. ఎలాగో తెలుసుకుందాం!

సోరియాసిసకు ఫలానా కారణమని కచ్చితంగా చెప్పడానికి వీల్లేదు. శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల, రక్షణ వ్యవస్థ శరీరం మీదే దాడి చేసే ఆటో ఇమ్యూన్ డిజార్డర్ ఫలితంగా సోరియాసిస్ తలెత్తవచ్చు. వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు. అయితే ప్రధానంగా మానసిక ఆందోళన, ఒత్తిడితో కూడిన జీవితం, కొన్ని రకాల ఆహార పదార్థాల వల్ల సోరియాసిస్ తలెత్తవచ్చని కొన్ని తాజా అధ్యయనాల్లో తేలింది. కొన్ని సందర్భాల్లో చర్మ గాయాలు మానిన తర్వాత, ఆ ప్రదేశంలో సోరియాసిస్ తలెత్తుతూ ఉంటుంది. దీన్ని 'కోబ్నర్ ఫెనొమినా' అంటారు. అలాగే కొన్ని రకాల మందులు, స్టిరాయిడ్స్ కూడా సోరియాసిసను ప్రేరేపిస్తాయి.

### ప్రధాన లక్షణాలు ఇవే!

దురద చర్మంపై పగుళ్లు, పొట్టు ఏర్పడడం

పొట్టులా ఏర్పడిన ప్రదేశం చుట్టూరా మంట

గోకినప్పుడు పొట్టు రాలడం రకాలున్నాయి సోరియాసిసలో ఐదు రకాలున్నాయి.

### అవేంటంటే...

ఫ్లేక్ సోరియాసిస్: 80ని సోరియాసిసలు ఈ కోవకు చెందినవే! ఈ సమస్య పెద్దల్లో ఎక్కువ.

గుట్టేట్ సోరియాసిస్: పిల్లలు, యుక్తవయస్కుల్లో తలెత్తుతుంది.

ఇన్వర్స్ సోరియాసిస్: స్థూలకాయుల్లో, చర్మపు ముడతల్లో వస్తుంది.

పస్ట్యులార్ సోరియాసిస్: అరుదుగా పెద్దల్లో వస్తుంది.

ఎరిత్రోడెర్మిక్ సోరియాసిస్: 90ని చర్మం సోరియాసిసకు గురైనప్పుడు ఎరిత్రోడెర్మిక్ సోరియాసిసగా పరిగణించాలి.

### శాశ్వత చికిత్స లేదు

సోరియాసిస్ చికిత్సతో అదుపులోకొచ్చి, పూర్తిగా నయమైపోయిన భ్రమను కలిగిస్తుంది. కొన్ని నెలలు, సంవత్సరాల పాటు కనుమరుగైపోయే ఈ సమస్య, అకస్మాత్తుగా తిరబెడుతూ ఉంటుంది. కాబట్టి సోరియాసిసకు శాశ్వత చికిత్స లేదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అయితే ఈ వ్యాధిని అదుపులో పెట్టగలిగే సమర్థమైన చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. లక్షణాలు, శరీరంలో సోరియాసిస్ తలెత్తిన ప్రదేశం, మందులకు స్పందించే శరీర తత్వం, సమస్యను ప్రేరేపించే కారకాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ చర్మ సమస్యకు వీలైనంతవరకూ అడ్డుకట్ట వేయవచ్చు. మరీ ముఖ్యంగా హోమియోపతిలో సోరియాసిసకు రెండు రకాల చికిత్సలను అనుసరిస్తారు. చర్మపు దురద ఏ ఏ సందర్భాల్లో తలెత్తుతోంది, ఎప్పుడు పెరుగుతోంది? అనే అంశాల ఆధారంగా అందించే చికిత్స ఒకటైతే, సోరియాసిస్ ప్యాచెసతో పాటు శరీర ఉష్ణోగ్రత, ఆహారపుటలవాట్లు, శరీరం మీద వాతావరణ ప్రభావాలు, మానసిక లక్షణాల ఆధారంగా అందించే చికిత్స రెండవది.

### నివారణ ఇలా...

పొట్ట, ఛాతీ, తల, గోళ్లు, వేళ్ల మధ్య, పిరుదుల మధ్య, తొడల మధ్య మొట్టమొదటిగా సోరియాసిస్ తలెత్తుతుంది. వీటిలో ఏ ఒక్క శరీర భాగంలో సోరియాసిస్ తలెత్తినా, తలలో కూడా తప్పనిసరిగా కనిపిస్తుంది. అయితే ఈ వ్యాధిని నివారించుకునే సమర్థమైన మార్గాలు కొన్ని ఉన్నాయి. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి. అలర్జీ కారక ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం, సమతులాహారం తీసుకోవడం, శుద్ధి చేసిన పదార్థాలు, పాలు, పాల ఉత్పత్తులు, శీతల పానీయాలకు దూరంగా ఉండడం అవసరం. అలాగే తేలికగా అరిగే ఆహారం తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోవాలి. క్రమం తప్పక వ్యాయామం చేయాలి. ఈ నియమాలు పాటించగలిగితే ఉన్న సోరియాసిస్ అదుపులో ఉండడంతో పాటు కొత్తగా సోరియాసిస్ తలెత్తకుండా ఉంటుంది.

# చరిత్ర సృష్టించిన భారత మహిళలు.. తొలి అంధుల టీ20 ప్రపంచకప్ కైవసం

### ఫైనల్‌లో నేపాల్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం

### టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా నిలిచిన భారత జట్టు

### ఫైనల్‌లో 44 పరుగులతో రాణించిన ఖులా షరీర్

### కొలంబో వేదికగా జరిగిన తుది పోరు



భారత మహిళల అంధుల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. మొట్టమొదటిసారిగా నిర్వహించిన మహిళల అంధుల టీ20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుని సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. కొలంబో వేదికగా జరిగిన ఫైనల్‌లో నేపాల్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. టోర్నమెంట్ ఆసాంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా టైటిల్‌ను ముద్దాడింది. ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు నేపాల్ బ్యాటర్లు తడబడ్డారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి నేపాల్ జట్టు 114 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం 115 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు, కేవలం 12.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఖులా షరీర్ 27 బంతుల్లో 4 ఫోర్లతో అజేయంగా 44 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

నవంబర్ 11న ఢిల్లీలో ప్రారంభమైన ఈ టోర్నీలో భారత్, నేపాల్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, శ్రీలంక, అమెరికా జట్లు పాల్గొన్నాయి. సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై 9 వికెట్ల తేడాతో గెలిచి భారత్ ఫైనల్‌కు చేరింది. ఈ చారిత్రక విజయం దేశంలో అంధుల క్రికెట్‌కు మరింత గుర్తింపు, ప్రోత్సాహం లభించడానికి మార్గం సుగమం చేస్తుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

# ముత్తుసామి సెంచరీ, యన్‌సెన్ మెరుపులు... తొలి ఇన్నింగ్స్ లో దక్షిణాఫ్రికా 489 ఆలౌట్

- గౌహతిలో జరుగుతున్న రెండో టెస్టు
- శతకంతో కదం తొక్కిన సెనురన్ ముత్తుసామి (109)
- మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న మార్కో యన్‌సెన్ (93)
- భారత బౌలర్లలో నాలుగు వికెట్లతో రాణించిన కుల్దీప్ యాదవ్
- టీమిండియా ముందు భారీ స్కోరును ఉంచిన సఫారీ జట్టు

గౌహతి వేదికగా భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా జట్టు భారీ స్కోరు సాధించింది. రెండో రోజు ఆటలో భాగంగా తొలి ఇన్నింగ్స్‌లో 151.1 ఓవర్లలో 489 పరుగులకు ఆలౌట్ అయింది. సెనురన్ ముత్తుసామి (109) అద్భుతమైన శతకంతో ఆకట్టుకోగా, మార్కో యన్‌సెన్ (93) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో భారత బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ ఇద్దరితో పాటు ట్రిస్టన్ స్టబ్స్ (49), కైల్ వెర్రెయిన్నె (45), టెంబా బావుమా (41) కీలక పరుగులు చేశారు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఆదిలోనే ఎదురుదెబ్బలు తగిలినా, మిడిల్ ఆర్డర్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు అద్భుతంగా రాణించారు. ముఖ్యంగా ఎనిమిదో వికెట్‌కు ముత్తుసామి, జాన్‌సెన్ కలిసి 97 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. కేవలం 91 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 93 పరుగులు చేసిన యన్‌సెన్ సెంచరీకి చేరువలో ఔటయ్యాడు. ముత్తుసామి మాత్రం ఓపికగా ఆడి తన టెస్ట్ కెరీర్‌లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. భారత బౌలర్లలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 115 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. అతనికి తోడుగా జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో రెండు వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించిన దక్షిణాఫ్రికా, మ్యాచ్‌పై పట్టు బిగించింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా రెండో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 9 పరుగులు చేసింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (2 బ్యాటింగ్), యశస్వి జైస్వాల్ (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. సఫారీల తొలి ఇన్నింగ్స్ స్కోరుకు టీమిండియా ఇంకా 480 పరుగులు వెనుకబడి ఉంది. రేపు ఆటకు మూడో రోజు భారత బ్యాటర్లు ఎలా రాణిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



# రిస్క్ చేయాలని డిసైడైన జాన్వీ కపూర్



ఎవరికైనా సక్సెస్, ఫెయిల్యూర్లు సహజం. అయితే సక్సెస్ ఎవరికైనా కిక్కిస్తే ఫెయిల్యూర్ మాత్రం చాలా డిజప్పాయింట్ చేస్తుంది. అయితే కొందరు మాత్రం ఫెయిల్యూర్ ను దృష్టిలో పెట్టుకుని, మళ్లీ అలాంటివి రాకుండా జాగ్రత్త పడితే, ఇంకొందరు మాత్రం ఫెయిల్యూర్ వచ్చినంత మాత్రాన దిగులు పడుతూ కూర్చుంటే ఎలా అని కెరీర్లో ముందుకెళ్తూ ఉంటారు. జాన్వీ కపూర్ ఇందులో ఆఖరి కోవలోకి వస్తుంది. అతిలోక సుందరి శ్రీదేవి కూతురిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన జాన్వీ, తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్ గా జాన్వీ నుంచి వచ్చిన పరమ్ సుందరి, సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి సినిమాలు బాక్సాఫీస్ వద్ద అనుకున్న ఫలితాల్ని అందుకోలేకపోయాయి. అయినప్పటికీ జాన్వీ కృంగిపోలేదు.



### యాక్షన్ సినిమాకు ఓకే చెప్పిన జాన్వీ

ఆ సినిమాలు ఫ్లాప్ అయినా జాన్వీ మాత్రం తర్వాతి సినిమాను లైన్ లో పెట్టి అందరికీ షాకిచ్చింది. టైగర్ ష్రాఫ్, లక్ష్య ప్రధాన పాత్రల్లో కరణ్ జోహార్ నిర్మాణంలో ఓ కొత్త యాక్షన్ డ్రామాకు జాన్వీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే జాన్వీ ఈ సినిమా ఒప్పుకోవడానికి కారణం.. తాను కేవలం రొమాంటిక్ సినిమాలు మాత్రమే కాదు, ఏ జానర్ సినిమాలైనా చేయగలనని నిరూపించుకోవాలనుకోవడం.

రాజ్ మెహతా దర్శకత్వంలో రానున్న ఈ సినిమా యాక్షన్, రివెంజ్, ఇంటెన్స్ డ్రామాతో రూపొందనుందని వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, ఈ మూవీలో జాన్వీకి చాలా స్ట్రాంగ్ రోల్ దక్కిందని, ఈ సినిమా ద్వారా తన ఎనర్జీ, ఎమోషన్, స్క్రీన్ ప్రెజెన్స్ ను మరింత బలంగా చూపించే అవకాశముందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఫ్యాన్స్ మాత్రం టైగర్ ష్రాఫ్, లక్ష్యతో జాన్వీ కెమిస్ట్రీ ఎలా ఉంటుందోనని డిస్కస్ చేసుకుంటున్నారు.

### ఛాలెంజింగ్ రోల్స్ పై ఫోకస్

రెండు ఫ్లాపుల తర్వాత జాన్వీ ఇలాంటి అడుగు వేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ఇలాంటి సినిమాలు ఎంచుకుని, ఫ్లాపులు తన కెరీర్ ను డిసైడ్ చేయలేవని జాన్వీ నిరూపించుకోవాలని చూస్తుంది. అంతేకాదు, నటిగా కూడా తనను ఛాలెంజ్ చేసే సినిమాలను ఎంచుకోవాలని డిసైడై, అలాంటి క్యారెక్టర్లపైనే జాన్వీ ఫోకస్ చేసి రిస్క్ చేయడానికి కూడా జాన్వీ రెడీ అయిందని బాలీవుడ్ మీడియా వర్గాలంటున్నాయి. ఈ సినిమా సక్సెస్ అయితే ఇప్పటివరకు ఉన్న జాన్వీ క్రేజ్ మరో లెవెల్ కు వెళ్లడం ఖాయం. ఎవరైనా వరుస ఫ్లాపులు వచ్చినప్పుడు సేఫ్ ప్రాజెక్టులను సెలెక్ట్ చేసుకుని హిట్ అందుకోవాలని చూస్తారని, కానీ జాన్వీ మాత్రం భిన్నంగా ఆలోచించి తన సత్తా ఏంటో చాటాలని కసిగా ఉందని, ఏ నటికైనా ఇలాంటి లక్షణమే ఉండాలని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com